POSTAL REGD.NO.PRAKASAM/16/2021-2023
REGD.NO. 37926/83
ESTABLISHED : 1983
జూలై 2021
వెల – ₹ 10.00

# సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

సంపుటి: 39 సంచిక: 03



దివ్య జనని శ్రీ శ్రీ శ్రీ అలివేలు మంగమ్మ తల్లి మహాసమాధి ప్రత్యేక సంచిక



# సాధన, సాధ్యమూ సద్గురువే!

*~ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ ~*

దైవాన్ని ఆరాధించడమంటే - దైవం అనే పరమార్థం వైపుకు - దైవంగా మనల్ని మనం రూపుదిద్దుకోవడమే! పరిణామం చెందించుకోవడమే! అలా కాని మనం పగ, ద్వేషము, క్రోధము, అసూయ, స్వార్థము, మమకారము, పక్షపాతబుద్ధి, అవివేకములకు బానిసలమై, వీటన్నిటికీ మూలమైన 'నేను వేరు, జగత్తు వేరు' అనే భావనకు బానిసలమై అవినీతిపరులుగా తయారై మనకు మనమూ, తద్వారా సమాజానికి ద్రోహం చేస్తూ సామాజిక అశాంతికి కారకులమవుతాము.

దైవాన్ని ఆరాధించే ప్రయత్నంలో మన జీవిత విధానంలో మార్పులు రాగల అవకాశాలు ఎన్నో! దైవంగా పరిణామం చెందాలంటే దైవీసంపత్తిని అలవరచుకోవడం తప్పనిసరి. అంటే పగ, ద్వేషమూ, క్రోధమూ విడచి – కరుణ, ప్రేమ, ఓరిమీ అలవరచుకుంటామన్నమాట. ఇతరుల ఉన్నతిని చూచి అసూయ పడే బదులు త్యాగభావాన్ని అలవరచుకుంటామన్నమాట! సర్వత్రా, సకల జీవులలోనూ దైవమున్నాడనే విషయాన్ని గుర్తుంచుకొనే ప్రయత్నంలో ఒకరు తక్కువనీ, మరొకరు అధికులనే భావాలను విడనాడుతామన్నమాట.

ఇట్టి సద్గుణాలను పొందాలంటే ఏం చేయాలి? నిరంతరం మనం దేన్నైతే భావనచేస్తూ వుంటామో అట్టి గుణాలనే పొందుతామని మహాత్ములు చెబుతారు. వెలగని దీపాన్ని వెలిగించాలంటే వెలుగుతున్న మరొక దీపం దగ్గరకు దాన్ని చేరిస్తే సరిపోతుంది.

దైవీసంపత్తియైన ఇట్టి సద్గుణజ్యోతులే ఆత్మజ్ఞానాన్ని సాధించిన మహాత్ములంతా. అట్టివారిని నిరంతరం గుర్తుంచుకుంటూవుంటే వారిలోని సద్గుణాలన్నీ మనలోనూ చోటు చేసుకుంటాయి. అలాంటి మహనీయులను గుర్తుంచుకోవడాన్నే సత్సంగము అంటారు. 'సత్' అంటే కేవలం దైవమే! సత్సంగం అంటే దైవ సన్నిధి-దైవీసంపత్తి గలవారి సాంగత్యము అన్నమాట. అంటే మహాత్ముల సన్నిధి అని అర్థం. ఎవరు సిసలైన మహాత్ములో, ఎవరుకారో, ఏది సత్సంగమో ఏది కాదో తేల్చుకోలేని నేటి రోజుల్లో సాటిలేని మహాత్ముడుగా అవతరించారు సాయి. విశ్వస్వరూపిగా, కరుణామయుడుగా ప్రకటమై నిరూపించుకున్న సాయిని విరామసమయమంతా స్మరించుకుంటే అంతకంటే సత్సంగం మరొకటి లేదు.

సద్గుణరాశియైన సాయిని నిరంతరం గుర్తుంచుకోవడానికి మొదట ఆయన చరిత్ర పారాయణ చేసుకుంటారు. తద్వారా ఆయన ఔన్నత్యం హృదయంలో నాటుకుని ఆయనపట్ల ఎనలేని భక్తివిశ్వాసాలు కలుగుతాయి. విరామ సమయంలో ఆయన

**మిగతా 29వ పేజీలో**

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

# సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:39 జూలై-2021 సంచిక:03

పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక, మన 'సాయిబాబా'

**మనందరికీ గురుపత్ని, దివ్యజనని అయిన పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ జూన్ 3, 2021 మధ్యాహ్నం గం|| 1:12 ని||లకు పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారిలో ఐక్యమయ్యారు.**

**ఈ సంచిక వారి దివ్య పాదపద్మములకు అంకితం.**

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 01. | సాధన, సాధ్యమూ సద్గురువే! | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 03 |
| 02. | లక్ష్యము మార్గము గమ్యము | పూజ్య గురుపత్ని అలివేలు మంగమ్మ | 05 |
| 03. | సాయి అవతరణే మానవాళికిగురుపూర్ణిమ | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 13 |
| 04. | మన ఇల్లు | శ్రీమతి అడిదం వేదవతి | 15 |
| 05. | పూజ్యశ్రీ అమ్మగారి అనుగ్రహం పొందటం ఎలా? | శ్రీ ఎక్కిరాల ద్వారకనాథ్ జ్ఞానేశ్వర్ | 20 |
| 06. | గురువును తెలుసుకోవాలి | పూజ్య గురుపత్ని అలివేలు మంగమ్మ | 25 |


చిరునామా
Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 500068
Phone No. +91 - 74160 41550
**www.saibharadwaja.org**
**www.saimasterforums.org**

చీఫ్ ఎడిటర్: డా|| ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

చందా వివరములు

| | | |
|---|---|---|
| విడి ప్రతి | : | రూ. 10-00 |
| సంవత్సర చందా | : | రూ. 100-00 |


సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.

# లక్ష్యము మార్గము గమ్యము

*~ పూజ్య గురుపత్ని శ్రీమతి అలివేలు మంగమ్మ ~*

ఒకరోజు సాయంత్రం పూజ్యశ్రీ మాస్టరుగారి సన్నిధిలో చాలామంది కూర్చుని వున్నారు. కొందరు ప్రశ్నలు వేస్తున్నారు, సందేహాలు వ్యక్తపరుస్తున్నారు. పూజ్యశ్రీ మాస్టరుగారు ఎంతో ఉత్సాహంగా సమాధానాలు యిస్తున్నారు. ఆ మాటల సందర్భంలో పూజ్యశ్రీ మాస్టరుగారు యిలా చెప్పారు :

"ఎవరికైనా ఏ పని చేయడానికైనా స్పష్టమైన అవగాహన వుండాలి. అసలు తమ గమ్యమేమిటో స్పష్టంగా వుండాలి. అందుకు చేరవలసిన మార్గం తెలుసుకోవాలి. దానిపట్ల లక్ష్యం దృఢంగా వుండాలి. ఈ మూడు దృఢంగా లేనిదే ఏదీ సాధించలేరు. జీవితంలో ఏమి సాధించదలచామన్నది ముఖ్యమైన విషయం. అందుకు ముందు మనకేం కావాలో స్పష్టంగా తెలియాలి. ఉదాహరణకు: శిరిడీ వెళ్ళాలనే లక్ష్యం పెట్టుకుంటాము. అక్కడకు వెళ్ళే మార్గము తెలుసుకుంటాము. చివరకు అక్కడకు అంటే గమ్యానికి చేరుతాము. అలాగే చదువు, ఉద్యోగము, మరొకటి, మరొకటి యిలా..."

ఇంతలో కూర్చున్నవారిలో ఒకరు అందుకుని, "మాస్టరు గారూ! మీరు చెబుతున్న విషయాలు విన్న మీదట, మీ పుస్తకాలు చదువుతున్నాము గనుక మాకు గమ్యమేమిటో తెలిసింది. అందుకువలసిన మార్గాలు గూడ మీరు ఎప్పుడూ బోధిస్తూనే వున్నారు. లక్ష్యమెలా వుండాలో గూడ అర్థమవుతూనే వున్నది. కానీ ప్రపంచంలో మావంటి సంసారులము, సామాన్య మానవులము ఎన్నో సంస్కారాలుగల సాటి మనుషులతో వ్యవహరించవలసి వస్తుంది. ఇవి గాక కుటుంబంతో, బంధువులతో ఎలా మసలుకుంటూ ఈ మార్గాన నడవాలో అన్నది కొరుకుడు పడటం లేదు. ఈ లక్ష్యమున్న వాళ్ళు నిరంతరం బాబా ధ్యాస ఎలా నిలుపుకోవాలో, దానిని ఎలా సాధించాలో అర్థంగావడం లేదు" అన్నాడు.

అందుకు పూజ్యశ్రీ మాస్టరుగారిలా సమాధానమిచ్చారు:

"అవును నిజమే నువ్వు చెప్పినట్లు మొదట్లో చాలా కష్టంగానే వుంటుంది. కానీ నిజంగా ఆచరించాలని ప్రయత్నం గట్టిగా చేస్తే రానురానూ సులభమవుతుంది. మరి అలాగాకపోతే ఈ సాధించేవారందరూ ఎలా సాధించగలుగుతున్నారు?" అంటూ యింకా యిలా చెప్పారు..

"అసలు దేనినైనా సాధించాలంటే దానికి కావలసిన అర్హతలేమిటో తెలుసుకోవాలి. దానికి ఏమి చేయాలో తెలుసుకోవాలి. ఉదాహరణకు ఒక ఇంజనీరో డాక్టరో

కావాలంటే దానికి కావలసిన కోర్సులు చదవాలి. చదవడానికి తగిన ప్రయత్నం చేయాలి. ఉదాహరణకు డాక్టరులా కావాలంటే దానికి కావలసిన పుస్తకాలు చదవాలి. ఊరికే పుస్తకాలు పట్టుకుని దానికి ఉన్న ప్రతికూల పరిస్థితుల గూర్చి ఆలోచిస్తుంటే డాక్టరు ఎలా అవుతాడు? ఇంట్లోని పరిస్థితులుగాని, కాలేజీలోని పరిస్థితులు గాని, బయట పరిస్థితులుగానీ, ఎట్లా వున్నా తన చదువు పూర్తి చేయాలి. అప్పుడే డాక్టరు అవుతాడు. అట్లానే ఆధ్యాత్మికత సాధించాలంటే దానికి ఏవేవి కావాలో వాటిని మనలో సమకూర్చుకోవాలి. అన్ని పరిస్థితులూ అనుకూలంగా వుంటేనే నేను బాబాను గుర్తుపెట్టుకోగలను అనడం, అలలు లేకుండా వున్నప్పుడు సముద్రంలో స్నానం చేస్తానని అన్నట్లుంటుంది. అందుకని పరిస్థితులను సాధనకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నం చేయాలి. అసలు పరిస్థితులు అనుకూలించడమంటూ సాధారణంగా జరగదు. ఎట్టి పరిస్థితిలోనైనా మనం అనుకున్నది సాధించవలసిందే! లేకుంటే మనం ఎప్పటికీ యిలానే వుంటాము. అందుకని అనుకూలత, ప్రతికూలత పరిస్థితులలో వుండవు. మనలోనే వుంటాయి. ఒకే పరిస్థితులలో ఒకడు ఒకరకంగా ప్రతిస్పందిస్తే మరొకరు మరొకరకంగా ప్రతిస్పందిస్తారు.

అందుకని ముందుగా మనలో వున్న బలహీనతలను, లేదా గుణాలను గమనించాలి. ఏవి ఎందుకు ఆటంకమవుతున్నాయో తెలుసుకోవాలి. అప్పుడు వాటిని ఎలా అధిగమించాలో ఆలోచించాలి. అట్టి ప్రయత్నం చేయాలి. కానీ మన స్వభావమే ఆటంకాలకు కారణమని తెలుసుకోవాలి. కొంచెం ఆలోచిస్తే ఇది ఎవరికైనా తెలుస్తుంది. ఇది తెలుసుకోలేక మన చుట్టూ వున్నపరిస్థితులూ, వ్యక్తులూ కారణమని అనుకుంటాము. కారణం యిది బాహ్యమైన విషయాలకు సంబంధించినది కాదు. పూర్తిగా యిది మానసికమైన విషయము. అందుకని దానికి అడ్డుపడే పరిస్థితులంటూ ఏవీ వుండవు.

ఉదాహరణకు ఒకనికి ఎంతో చదువుకోవాలని వుందనుకుందాం. వాడు స్కూలులో చేరగలిగితే పుస్తకాలు లేకపోయినా, ఇంట్లో కరెంటు లేకపోయినా, మరొకరి పుస్తకాలు తీసుకునో, వీధి దీపాల దగ్గరో ఏదో ఒక విధంగా చదువుకుంటాడు. కానీ వాడు స్కూలుకే వెళ్ళలేని పరిస్థితిలో వున్నప్పుడు అతడెలా చదువు కొనసాగించగలడు? కారణం వాడు చదువుకోవడం చదువుకోకపోవడమన్నది పూర్వకర్మననుసరించి వుంటుంది. కనుక పరిస్థితులు అనుకూలించడమూ, అనుకూలించకపోవడమూ వుంటుంది. కానీ అదే భగవంతుని ఆరాధించే విషయంలో ఎటువంటి అడ్డంకులూ వుండవు, మన మనస్సు తప్ప. మన సంస్కారాన్ని బట్టి మన మనస్సు నిరంతరం ఎన్నో ఆలోచనలను చేస్తూంటుంది. వాటిని తప్పించి సాధనపై మనస్సు పెట్టడానికి, చేసే ప్రయత్నమే సాధన. ఏ పని చేస్తున్నా చేయకపోయినా మనస్సు దాని దోవన అది ఆలోచిస్తూనే వుంటుంది. ఆ ఆలోచనలకు బదులు మనం చెయ్యాలనుకున్న ఆలోచనలను చేయడానికి ప్రయత్నించాలి. అప్పుడు ఏ పని చేస్తున్నా దాని పని అది కొనసాగిస్తూ వుంటుంది."

అందుకు అతడు అందుకుని, "అదెలా సాధ్యం మాస్టారు? ఇతరులతో మాట్లాడుతున్నపుడు బాబాను ధ్యానించడమెలా?" అని అడిగాడు.

పూజ్యశ్రీ మాస్టరుగారు అన్నారు: "ఏమి? ఎందుకు సాధ్యం కాదు? మనం అనుకోవాలే గానీ సాధ్యంగానిదంటూ ఏమీ లేదు. మరి అలా చేసిన వాళ్ళేగదా గొప్ప భక్తులైనారు!

ఉదాహరణకు మన ఇంట్లో ఎంతో ఆప్తులైన వారు దూరమైపోయారు. కొంతకాలంపాటు మనమేం చేస్తున్నా, ఎవరితో ఏమి మాట్లాడుతున్నా ఆ ఆలోచనలే మెదులుతుంటాయి.

లేకపోతే మనలను ఎవరన్నా బాధ పెడుతున్నాడనుకుందాము. మనం ఏది చేస్తున్నా అదే మనస్సులో మెదులుతుంటుంది. అలాగే ఒక యువకుడు ఒక అమ్మాయిని ప్రేమించాడనుకుందాం. అతడు ఏమి చేస్తున్నా ఆ పిల్లమీదే మనస్సు లగ్నమై వుంటుంది. ఆ అమ్మాయి గురించిన ఆలోచనలే కొనసాగుతుంటాయి. అలాగే మనం ఏం చేస్తున్నా బాబా మీద మనస్సు లగ్నమై వుంటుంది. అది మన కోరిక ఎంత దృఢంగా వున్నది అన్నదాని మీద ఆధారపడివుంటుంది. డబ్బు సంపాదించాలన్న కోరిక దృఢంగా వున్నవాడు అదే ఆలోచనలు చేస్తూ అందుకు కావలసిన ప్రయత్నాలు చేస్తుంటాడు. అలాగే దేనిమీదైనా

సరే కావాలని బాగా కోరిక కలవాడు దానికోసం నిరంతరం ప్రయత్నిస్తుంటాడు. ఇది అందరికీ తెలిసిన విషయమే. అలాగే సాధన గూర్చి మన కోరిక బాగా వున్నపుడు అందుకు ఎప్పుడూ ప్రయత్నిస్తూనే వుంటాము. దానికి ఏవీ అడ్డురావు."

అతడు : నాకేమీ అర్థం కావడం లేదు. మాస్టారూ! కొన్ని పరిస్థితులలో అంటే ఎవరైనా మనతో తగవులాడితే, లేదా అనవసరంగా మనలను ఎవరైనా అనరాని మాటలు అంటూ వుంటే వాళ్ళల్లో బాబాను చూడడమెలా మాస్టారూ!"

మాస్టరుగారు : "బాబాను చూడడమంటే వారికి నమస్కరించమని కాదు, వాళ్ళ పాదాలమీద పడమనీ కాదు. వాళ్ళతో ఎలా వ్యవహరించాలో 'అలా వ్యవహరిస్తూ వారిలోగూడ బాబా వున్నారనే విషయాన్ని గుర్తుపెట్టుకుంటూ వుండాలి. పిల్లిలో, కుక్కలో గూడ బాబా తాము వున్నామని అన్నారు గదా! అంటే వాటిలో వున్నారని తలచి వాటిని కొట్టవద్దని, అసహ్యించుకోవద్దనీ అర్థం. అంతేగాని అవి వంటింట్లోకి వస్తే బయటకు పంపవద్దని కాదు. మనతో పాటు దానిని కూడ కూర్చోబెట్టుకుని మన విస్తట్లో దానికి గూడ తినిపించమనీ గాదు. ఎవరితో ఎలా వుండాలో అలా వుండాల్సిందే. కానీ ఎవరిపైనా ద్వేషము, కోపము, అసూయ మొదలైన భావాలు పెట్టుకోకుండా వుండాలి. మనం అందరిలో బాబా వున్నారన్న భావాన్ని నిలబెట్టుకోవడానికి ప్రయత్నిస్తుంటే మనలోని అవగుణాలు పోయే అవకాశముంది. మనం అలా చేస్తుంటే ఒక్కొక్కప్పుడు అవతలి వాళ్ళల్లో గూడ మార్పు వచ్చే అవకాశముంది. ఉదాహరణకు నువ్వు చెప్పినట్లు అవతలి వాడు మనలను చాలా ఇబ్బంది పెడుతున్నాడు. చాలా అనవసరంగా అనరాని మాటలు అంటున్నాడనుకుందాం. అతనిలో గూడ బాబా వున్నారని భావన చేస్తున్నప్పుడు బాబాయే ఎందుకో ఇలా అనిపిస్తున్నాడు. ఇది మనకు మంచిది కాబట్టే చేస్తున్నాడు అనిపిస్తుంది. లేకపోతే మన చెడ్డకర్మను ఈ విధంగా తొలగింపజేస్తున్నాడు అనుకుంటాము. అలా అనుకున్నప్పుడు మనము ఆవేశపడకుండా మాట్లాడగలుగుతాము. అలా చేస్తుంటే ఒక్కొక్కసారి అవతలి వాళ్ళలో గూడ మంచి మార్పు రావచ్చు. అంతేగాక వాళ్ళను గూడ సరైన మార్గంలో నడిపించమని, సరియైన విధంగా మార్పు తెమ్మనీ బాబాను ప్రార్థించవచ్చు".

అతడు: "ఒక్కొక్కసారి ఈ బాదరబందీ అంతా ఎందుకు? ఇంట్లోనుంచి ఎక్కడికైనా వెళ్ళిపోతే హాయిగా సాధన చేసుకోవచ్చు గదా! అనిపిస్తుంది మాస్టారూ!"

పూజ్యశ్రీ మాస్టరుగారు : "వెళ్ళిపోవచ్చు. కానీ పరిస్థితులనుంచి తప్పుకోవడానికి గాదు. కావలసినది పొందడానికి వెళ్ళాలి. కానీ అప్పుడు ఎవడూ హాయిగా వెళ్ళడు. విపరీతమైన ఆవేదనతో, తపనతో వైరాగ్యముతో వెళ్తాడు. అంతగా తీవ్రమైన కోరిక వున్నప్పుడు ఇంట్లో విషయాలు అనవసరమైనవి పట్టకుండా పోతాయి. ఎంతవరకూ అవసరమో అంతవరకే పట్టించుకుంటాడు. తర్వాత తనకు తెలియకుండానే అన్నీ విడిచి వెళ్ళిపోవడం జరుగుతుంది. అంటే వెళ్ళకుండా వుండలేడన్నమాట. వెళ్ళిపోతే బాగుంటుంది అని అనుకున్నంతకాలం వెళ్ళిపోవడానికి పరిపక్వత రానట్లే లెక్క. పూర్తి విరాగియైనవాడు ఇల్లూ వాకిలీ పట్టకుండా వెళ్ళిపోతాడు. సాధన కొనసాగిస్తాడు. అలాగాక పరిస్థితులనుంచి తప్పించుకునేందుకు ఎక్కడకు వెళ్ళినా అక్కడి పరిస్థితులు యిలానే చుట్టుకుంటాయి. ఉదాహరణకు సంసార బాధ్యతలనుండి తప్పించుకుందామని ఒకడు ఏ ఆశ్రమానికో వెళ్ళాడని అనుకుందాము. ఆశ్రమాలలో గూడ మనలాంటి మనుష్యులే వుంటారు. కనుక వాళ్ళతోనూ సమస్యలు వస్తాయి. అలాగాక ఏ అడవిలోకో వెళ్ళాడని అనుకుందాము. అక్కడ అన్నింటికీ యిబ్బందే! అంతేగాక ఎప్పుడే క్రూరజంతువు వచ్చి మీద పడుతుందోనని భయము. వీటన్నింటికీ భయపడి అక్కడికంటే ఇల్లే బాగుందని ఇంటికి తిరిగి వస్తాడు. అలాగాక ఏదో ఒక ఊరిలో పాడుబడ్డ గుడిలోనో లేక ఊరి బయట ఏ చెట్టు క్రిందనో ముక్కుమూసుకుని కూర్చున్నాడనుకుందాం. అప్పుడు ఎవరో గొప్పస్వామి వచ్చాడనే భావంతో మెల్లగా జనం చుట్టూ చేరడం ప్రారంభిస్తారు. తమ కోరికలు కష్టాలు తీర్చమని అడగడం ప్రారంభిస్తారు. చెప్పకుండా వుంటే ఒక రకమైన గోల, చెప్పడం ప్రారంభిస్తే మరొక రకమైన గోల మొదలవుతుంది. అదే బాగుందనుకున్నవాడు, అంటే

తన దగ్గరకు జనం జేరడము తనకు స్వామి స్థానము బాగుందనుకున్నవాడు తన దగ్గరకు యింకా యింకా జనం రావాలని తన స్థానం యింకా, యింకా పెరగాలని భావిస్తాడు. ఆ స్థానం దిగజారకుండా వుండడానికి జనం చేరడానికి, వచ్చినవారు వెళ్ళిపోకుండా వుండడానికీ పడరాని పాట్లు పడతాడు. అంటే కీర్తికాంక్ష పెరిగి పోతుందన్నమాట. తనను పొగిడేవారంటే యిష్టము, విమర్శించే వారిమీద కోపము, ద్వేషము మొ॥న వన్నీ వచ్చి ప్రతీకారవాంఛ కలిగి, యిలా ఇంట్లో వున్నప్పటికంటే ఎక్కువ ఏర్పడి ఊబిలోకి దిగిపోతాడు. అందుకని ఎటుచూసినా పూర్తిగా విరాగి కాని వాడికి పాట్లు తప్పవు. అందుకని కుటుంబంతో ఉంటూనే వచ్చేసమస్యలన్నింటినీ ఎదుర్కొంటూనే సాధన సాగించాలి. సుఖం గాని, దుఃఖం గానీ బాబా ప్రసాదంగా తీసుకోగలగాలి. నిందాస్తుతులను కూడా ఆయనే ప్రసాదించారని భావించాలి.

అప్పుడు అన్నింటి పట్ల నిర్లిప్తత కలుగుతుంది. బాబా పట్ల భక్తి పెరుగుతుంది. మనలో వున్న ఒక్కొక్క బలహీనత తొలగి పోతుంటుంది. కారణం అప్పుడు బాబామీద బాగా భక్తి వుంటే ఎవరితోనూ కీచులాటలు వుండవు. కారణం బాబా ఎవరితోనూ కీచులాటలూ, తగువులూ వద్దన్నారన్న విషయం గుర్తొస్తుంది. శరీర సౌఖ్యాలపట్ల ఉదాసీనత పెరుగుతుంది. వైరాగ్యం జనిస్తుంది. బాబాను స్మరించుకున్నకొద్దీ ఆయన చర్యలు, సూక్తులూ, ఎప్పుడూ గుర్తుకు వస్తుంటాయి. కుక్క, నక్కలలోనూ, చీమలు, దోమలలోనూ నేనే వున్నానని బాబా చెప్పినమాట గుర్తొస్తూంటుంది. అందుకని మన గమ్యం మీద తపనను పెంచుకోవటం ముఖ్యం. లక్ష్యాన్ని ఎప్పుడూ గుర్తుపెట్టుకోవాలి. అప్పుడు ఎక్కడ వున్నా ఏం చేస్తున్నా సాధన కష్టం కాదు.

అతడు: అయితే ఈ సాధన చాలా కష్టం మాస్టారు!!

పూజ్యశ్రీ మాస్టరుగారు: ఏదైనా యిష్టముంటే కష్టమనిపించదు. అందుకని సాధన మీద యిష్టం పెంచుకోవాలి. అయినా కష్టపడకుండా ఏది వస్తుందోయ్! చెప్పు! వంట చేయకుండానే భోజనం వస్తుందా? సరే! నువ్వు వంట చేయకుండానే భోజనం వస్తుందనుకుందాం. కానీ ఎవరో ఒకరు చేయాల్సిందే కదా! దానికి మూల్యం నువ్వు చెల్లించుకోవాల్సిందే గదా! పోనీ ఇంట్లో ఆడవాళ్ళే చేస్తారనుకుందాం.. దానికి కావలసినవన్నీ సమకూర్చాలి గదా! అంటే దానికోసం నువ్వు డబ్బులు సంపాదించాలి కదా! దానికోసం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఉద్యోగంలో కష్టపడాలి కదా! ఆలోచించు. దేనిలో కష్టం లేదంటావు? ఎవరినైనా చూడు! కష్టపడకుండా ఏదైనా సాధించగలుగుతున్నారా? చివరకు రాజు రాజ్యభోగాలు అనుభవిస్తున్నాడనీ, సుఖంగా వుంటాడని అనుకుంటాము. కానీ దేశం మొత్తం బాధ్యత, ఆ దేశంలోనే ప్రజలందరి కష్టసుఖాలూ చూసే బాధ్యత ఆ రాజుదే కదా! ఇతర రాజులు రాజ్యాన్ని ఆక్రమించకుండా చూసుకోవడం మొ॥న ఎన్ని బాధ్యతలలో రాజుకుంటాయి. మరి రాజు రాజ్యభోగాలు కావాలనుకుంటే ఈ బాధ్యతలు, కష్టాలూ, తప్పవు మరి! కనుక ఏ విధంగా ఆలోచించినా కష్టపడకుండా జీవితం నడవదని తెలుస్తుంది".

"ఏ కష్టమొచ్చినా నువ్వు బాబాను మరీ ఎక్కువగా సేవిస్తుండడం వల్లనే ఇవన్నీ వస్తున్నాయంటున్నారు మాస్టారూ!"

"అసలు కష్టాలు, సమస్యలూ లేని వారంటూ ఎవరైనా వున్నారా! నాకు ఏ సమస్యలూ లేవు, నేను హాయిగా వున్నాను అని ఎవరినైనా చెప్పమనండి చూద్దాం. ఎవ్వరూ చెప్పలేరు. నిజంగా సమస్యలేవీ లేనివారు గూడ ఏదో సమస్యను సృష్టించుకుని మరీ కష్టాలు పడుతున్నామని చెబుతారు. అయినా బాబాను సేవించని వారంతా సుఖంగా వున్నారా? వాళ్ళకే సమస్యలూ లేవా?

అతడు: "నిజంగా ఇవేవీ లేనివాళ్ళంతా సుఖంగా వున్నట్లనిపిస్తున్నది మాస్టారూ!"

పూజ్యశ్రీ మాస్టరుగారు : "నిజంగా సుఖంగా వుంటే అంతకంటే కావలసినది ఏమున్నది? హాయిగా కాలుమీద కాలు వేసుకుని కూర్చోవచ్చు గదా! 'నేను సుఖంగా వున్నాను' అని గుండె మీద చెయ్యి వేసుకుని చెప్పమనండి చూద్దాం. ఒక్కరు గూడ చెప్పరు, చెప్పలేరు. అసలు ఆధ్యాత్మికత అంటే ఏమిటో అవగాహన లేక, బాబా అంటే ఏమో, అసలు మహాత్ములు ఎందుకు వస్తారో, ఏమి చేస్తారో తెలియక అలా మాట్లాడుతుంటారు. బాబాను, మహాత్ములను సేవించినందువలన కష్టాలు

ఎందుకు వస్తాయి? ఆయనను కొద్దిగా ప్రార్థించినవారికే మేలు జరుగుతుంటే, బాగా సేవించిన వారికి వారు కష్టాలను కలిగిస్తారా? అలా చేసినందువలన వారికేమి లాభము? వారికి మనమంటే ద్వేషమా? సకల జీవులను సమభావంతో ఆదరించేవారు, ప్రేమించేవారూ అయిన మహాత్ములు మనకు కష్టాలను ఎందుకు కలుగజేస్తారు? తల్లిదండ్రులకంటే ప్రేమస్వరూపులు వారు. అందుకే బాబా అంటారు : నాకెవ్వరిమీదా కోపం రాదు. తల్లికి బిడ్డలమీద ఎప్పుడైనా నిజంగా కోపం వస్తుందా? సముద్రమెన్నడైనా నదులను త్రిప్పి పంపివేస్తుందా! అందుకని మహాత్ములు అపార కరుణామయులు. నిరంతరం సకల జీవుల శ్రేయస్సు కొరకు పాటుపడుతుంటారు. అలాంటి వారు మనలను కష్టపెట్టడం ఎలా సాధ్యం?

భక్తుడు : "మరి భక్తులకే కష్టాలు వస్తున్నాయ్ కదా మాస్టారూ! మరి – బాబా రక్షించాలి గదా!

పూజ్యశ్రీ మాస్టరుగారు : – "రక్షించడమంటే మన దృష్టిలో ఏమిటి? మన కష్టాలు తొలగించి మనలను సుఖంగా వుండేటట్లు చేయడం. అసలు కష్టాలు ఎందుకు – వస్తాయో ముందు తెలుసుకోవాలి. తర్వాత మహాత్ములు వాటిని ఎందుకు తొలగిస్తారో, ఎందుకు తొలగించరో తెలుసుకోవాలి"

భకుడు : "తొలగించరా? తొలగించకపోతే వాళ్ళనెందుకు పూజించాలి?"

"అదేనోయ్! మరి తెలుసుకోవాల్సింది! అసలు మనకు కష్టాలు ఎందుకు వస్తాయంటావ్?"

"పూర్వ జన్మలో మనం చేసుకున్న పాపాలవల్ల అని పెద్దలు చెప్పారు"

"అసలు పాపాలంటే ఏమిటీ?"

"మనం చేసుకున్న చెడ్డ కర్మలు".

"అంటే పూర్వజన్మలో మనం చేసుకున్నవేనన్నమాట! అంతేనా?"

"అవును అంతే!"

"ఉదాహరణకు నీ సోదరుడు నీ ఆస్తిని అన్యాయంగా చేజిక్కించుకున్నాడు. వాడు సుఖాలను అనుభవిస్తున్నాడు. నువ్వు మాత్రం వాడు నీ ఆస్తి కాజేయడం వల్ల చాలా యిబ్బందులు పడుతున్నావు. కానీ అతడు చేసిన అన్యాయానికి ప్రతీకారం తీర్చుకునే పరిస్థితి నీకు లేదు. అప్పుడు నువ్వు ఏమనుకుంటావు? అతడు నీకు చేసిన అన్యాయానికి ప్రతీకారం జరగాలని అనుకుంటావా? లేదా?

"తప్పకుండా అనుకుంటాను మాస్టారు!"

"ఎందుకు అనుకుంటావు? ఏమి? నీకు అతడు అన్యాయం చేస్తే ఏముంది? అతనికి నిన్ను మోసం చేసే సామర్థ్యం వున్నది కనుక నీ ఆస్తి లాక్కున్నాడు. దానిలో తప్పేముంది?"

"అదేంటి మాస్టారు అలా అంటారు? వాడు నన్ను మోసం చేయడం సరైనదా? దానికి ప్రతిఫలం అనుభవించకపోతే ఎలా?"

"అయితే ఎందుకు అనుభవించాలో చెప్పు"

"ఎందుకంటే అవతలివాడిని మోసం చేయడం తప్పు కనుక"

"ఎందుకు తప్పని నేనడుగుతున్నాను"

"అవతలివాడు బాధపడతాడు కదా!"

"అవతలివాడు – బాధపడకపోతే తప్పుకాదంటావా. ఉదాహరణకు నువ్వు మీ సోదరుడు చేసినదానికి బాధపడలేదనుకుందాం. 'నేను వాడికి క్రిందటి జన్మలో ఋణపడివుండి వుంటాను కనుక ఆ ఋణం తీర్చుకున్నాడు' అని అనుకుని నువ్వు బాధపడలేదని అనుకుందాము. అప్పుడు గూడా అతడు చేసినది తప్పేనంటావా?

★ఎందుకు కాదు? మోసం చేయడమే తప్పని అంటారు గదా!"

"అంటే అవతలివాడు బాధపడినా, పడకపోయినా మోసం చేయడమనేది తప్పంటావు. బాగుంది. అయితే అతడు దానికి ప్రతిఫలం అనుభవించడం వల్ల జరిగేదేమిటి? వాడివలన బాధపడిన వాడు కష్టాలు పడడం జరిగిపోయింది గదా!

(కొద్దిసేపు ఆలోచించి) "ఎందుకో తెలియట్లేదు గానీ అది మాత్రం తప్పేననిపిస్తున్నది. అనుభవించాల్సిందేననిపిస్తున్నది మాస్టారూ!"

"అంటే అవతలివాడు బాధపడకపోయినాసరే అతడు తాను చేసిన చెడ్డపనికి ఫలితం అంటే శిక్ష అనుభవించాల్సిందేనంటావ్, అంతేనా?"

"అంతే మాస్టారూ"

"సరే! నువ్వన్నట్లుగానే అతడు తాను చేసిన పాపానికి మరుజన్మలో కష్టాలను అనుభవిస్తున్నాడనుకుందాం. అప్పుడతనికి తెలిసినవారు ఎవరో బాబా గురించి చెప్పి, ఆయనను ప్రార్ధించుకుంటే అతని కష్టాలు తొలగుతాయని చెప్పారు. అతడు తన కష్టాలను తీర్చమని బాబాను ప్రార్ధిస్తున్నాడు. అప్పుడు బాబా అతని కష్టాలు తీర్చాలా? అక్కర్లేదా?"

"............"

"చెప్పవోయ్! తీర్చాలా, అక్కర్లేదా?"

".......... "

"క్రిందటి జన్మలో నిన్ను అష్టకష్టాలూ పెట్టాడు. నీ ఆస్తి లాగేసుకున్నాడు. కానీ ఈ జన్మలో ఆ పాపానికి ప్రతిఫలం అనుభవించకుండా తీసివేయమంటున్నాడు. మరి బాబా తీర్చడం నీకిష్టమేనంటావా?"

"పెద్ద చిక్కే వచ్చింది. మాస్టారూ! అతడనుభవించకపోతే ఆ కష్టం ఎలా తెలుస్తుంది?"

"అనుభవిస్తే తెలుస్తుందా?"

"ఏమో మాస్టారూ".

"అంటే తెలిస్తే ఏమవుతుంది! తెలియకపోతే ఏమవుతుంది? ఉదాహరణకు ఒకడు దొంగతనం చేసాడనుకుందాం. వాడికి శిక్ష ఎందుకు వేస్తారు"

"దొంగతనం చేసినందుకు"

"దొంగతనం చేయడం జరిగిపోయింది కదా! వాడికి శిక్ష విధిస్తే మాత్రం ఏం లాభం?"

"శిక్ష విధిస్తే ఆ భయంతో మళ్ళీ దొంగతనం చేయకుండా వుండడానికి"

"అంటే అతడు దొంగతనం చేసే బుద్ధిని మానుకునే వరకూ శిక్షలు అనుభవిస్తూనే వుండాలి. అంతేనా?"

"అంతే మాస్టారూ!"

"అయితే బాబా నీ సోదరుడు చేసిన తప్పుకు శిక్ష అనుభవించనివ్వాలా? లేక శిక్ష రద్దు చేసి కాపాడాలా?"

(కాసేపు ఆలోచించి) "మరి బాబా కొంతమందిని కాపాడుతున్నారు గదా!"

"అవును. బాబా రక్షించేమాట నిజమే. శిక్ష విధించిన ప్రభుత్వమే ముద్దాయిలకు శిక్షను తగ్గించడము, రద్దు చేయడము చేస్తుంది గదా! ఎందుకని?"

"వాళ్ళలో మంచి పరివర్తన వస్తే అలా చేస్తారు"

"అలాగే వీళ్ళలో గూడ పరివర్తన వస్తే, అంటే ఇకనుంచి అటువంటి తప్పుడు పనులు చేయకుండా వుంటాడు అని బాబాకు అనిపిస్తే తప్పక రక్షిస్తారు. వాడి పరిస్థితిని బట్టి కొన్ని సందర్భాలలో శిక్షను తగ్గిస్తారు. కొన్ని సందర్భాలలో శిక్షను రద్దు చేయడం కూడా జరుగుతుంది. అనుభవించడమే శ్రేయస్కరమైతే అనుభవింప జేస్తారు"

"కొంతమందికి ఒక్క పారాయణ చేస్తే చాలు, కష్టాలు తీరుస్తున్నారు బాబా. మరి కొంతమందికి ఎన్ని పారాయణలు చేసినా తీర్చడం లేదు. ఎందుకని మాస్టారూ! వాళ్ళు ఆయనను బాగా సేవించడం వల్ల తీరుస్తున్నారా? వీళ్ళకు భక్తి, శ్రద్ధ చాలినంత లేకపోవడం వల్ల తీర్చడం లేదా ?"

"అలాగాదు. ఒక డాక్టరున్నాడనుకో, మామూలు జ్వరం వచ్చింది. మందిచ్చాడు. ఒక్కరోజులోనో, రెండు రోజులలోనో తగ్గిపోతుంది. అదే మలేరియా అయితే కొంతకాలం పడుతుంది. అదే టైఫాయిడ్ అయితే ఇంకా ఎక్కువ రోజులు పడుతుంది. అదే డాక్టరు. కానీ రోగాన్ని బట్టి మందు యిస్తాడు. చికిత్స, నివారణ చేస్తాడు.

అలాగే బాబా గూడ మన దుష్కర్మను బట్టీ కొంతమందికి వెంటనే, మరి కొందరికి ఆలస్యంగానూ తీర్చడం జరుగుతుంది"

"అయితే బాబా ఆ డాక్టరులాగా కాడు గదా మాస్టారూ! ఆయన సర్వసమర్దుడు గదా!"

"అవును. సర్వసమర్థుడే. కానీ ఆయన తన ధర్మం ప్రకారం శ్రేయస్సునే చేకూరుస్తుంటారు"

"అదెలా మాస్టారూ! రక్షించడమే ఆయన ధర్మం గదా!"

"అయితే నీ ఆస్తి కాజేసి నిన్ను అష్టకష్టాలు పెట్టినవాడు బాబా పారాయణ చేయగానే అతని పాపాన్ని రద్దు చేయాలనే అంటావా?"

"ఎలా అంటాను. వాడు అనుభవించాల్సిందే! వాడు చేసిన పనికి నేనెన్ని కష్టాలు పడ్డాను?"

"మరి ఎవరు చెడ్డకర్మలు చేసినా అనుభవించాల్చిందేనా?"

"అంతే మాస్టారూ!!

"అయితే నువ్వు చేసిన దానికి?"

"అనుభవించాల్సిందే!

"మరి బాబా ఎందుకు తీసివేయలేదని అంటున్నావు?"

"అది నిజమే! కానీ కొంత మందికి ఆయన తొలగిస్తున్నాడు గదా!"

"తొలగిస్తారు. కానీ ఎందుకు చేస్తారో, ఎలా చేస్తారో తెలియక పోవడం వల్ల వచ్చే ప్రశ్నలివి. పారాయణలు చేయగానే, బాబాను ప్రార్థించగానే తగ్గిస్తే గనుక ప్రతివాడు తన యిష్టమొచ్చినట్లు చెడ్డగా ప్రవర్తించి పారాయణ చేస్తాడన్నమాట. అప్పుడు సమాజం ఎలా వుంటుందో ఆలోచించు. ఒకడు మరొకణ్ణి హత్య చేసాడని అనుకుందాం. వాడు పారాయణ చేయగానే ఆ పాపం అనుభవించకుండా బాబా తప్పించారనుకుందాం. ఇక అలాగే అందరూ చెడ్డ పనులు చేయడం మొదలు పెడతారు. ఇష్టమొచ్చినట్లు ప్రవర్తించడం, బాబా పారాయణలు చేయడం జేస్తారు. అంటే బాబా మన తప్పులను సమర్థించేవాడుగా వుంటాడన్నమాట. అంటే లంచం యిస్తే చాలు, మన పని చేసిపెడతాడన్నమాట!"

"మరి బాబా ఎలా తీరుస్తున్నారు?"

"వాళ్ళ ప్రార్థనను బట్టి, వాళ్ళపూర్వజన్మ కర్మను బట్టి, వాళ్ళ సంస్కారాన్ని బట్టి ఇలా అనేక కారణాలుగా తీరుస్తారు. కొంతమంది కర్మను పూర్తిగా తీసివేయడం జరుగుతుంది. కొంతమందికి కొంత అనుభవింప చేస్తారు. కొంతమందికి వచ్చే జన్మకు బదిలీ చేస్తారు. కొంతమంది కర్మను తామనుభవిస్తారు. కొంతమందికి కర్మను పూర్తిగా అనుభవింపజేస్తారు."

"అయితే అనుభవించడం మంచిదా?"

"అనుభవించడమూ మంచిదే! తగ్గించమని ప్రార్థించడమూ మంచిదే. కానీ ఆయన తగ్గించలేదని నిష్ఠూరపడడము, కోపగించుకోవడమూ, అలగడమూ మంచిది కాదు. గట్టిగా పట్టుబడితే ఆయన మన కోరిక తప్పక నెరవేరుస్తాడు. కానీ దాని ఫలితం మనమనుభవించాల్సి వుంటుంది. అందుకని ఆయనను తగ్గించమని ప్రార్థించవచ్చు. కానీ 'నాకేది శ్రేయస్కరమో అది మాత్రమే చేయి' అని ప్రార్థించడం ఉత్తమం"

"తర్వాత అనుభవించవలసి వస్తుందని మీరు అన్నారు గదా! అదేమిటి? అనుభవించవలసిన కర్మను తీసివేయడం కాదా ఆయన చేసేది?"

"అవును.తీసివేయడంలోనేకర్మనుఅనుభవించడము, తగ్గించడము, రద్దు చేయడమూ వుంటుంది. ఎలాగంటే ఒకడు చీకటిలో వెళ్తున్నాడు. బాబాను స్మరించుకుంటున్నాడు. వాడికి త్రోవలో ఒక పామును తొక్కడం వలన ఆ పాము అతనిని కరవవలసివున్నది. కానీ వాడు బాబాను స్మరించుకుంటూ వెళ్తున్నాడు గనుక వాడి కాలికి ఎదురు దెబ్బ తగిలి కాలు పాము మీద పడకుండా అవతలికి పడింది. దానితో పాము కరచే కర్మ తొలగింది. అలా గూడ చేస్తారు బాబా. కానీ యిక్కడ తమాషా ఏమిటంటే వాడు ఏమనుకుంటాడంటే, "నేను బాబాను స్మరించుకుంటూ వెళ్తున్నాను గదా! నాకెందుకు ఎదురు దెబ్బ తగిలింది? బాబా నన్ను రక్షించవచ్చు గదా,' అని. అంటే వాడి కాలికి ఎదురు దెబ్బ తగిలి రక్తం కారడమే తెలుస్తుంది గానీ వాడికి పాము కరవడం నుండీ రక్షింపబడినట్లు తెలియదు గదా!

అలాగే ఒక అమ్మాయికి ఒక మంచి సంబంధం చేస్తామని అంటే బాబా వద్దంటారు. వాళ్ళు వినక పోతే 'చేసుకో పో, ఏడ్చుకో!' అంటారు. అయినా వాళ్ళు ఆ అమ్మాయికి ఆ సంబంధమే చేస్తారు. ఆరు నెలల లోపనే ఆ పిల్ల భర్త చనిపోతాడు. అక్కడ జరిగినదేమిటంటే బాబా – ఆ పిల్లను ఆ దుష్కర్మనుంచి తప్పించాలని అనుకున్నారు. కానీ ఆమె దుష్కర్మ వాళ్ళచేత ఆ పనే చేయించింది. అట్లా మనం గూడ ఆయన మనకు శ్రేయస్కరమైనది చేయబోతే మన యిష్టాయిష్టాలను బట్టి ఆయన మాట వినము. ఆయన చేసినది శ్రేయస్కరమని అనుకోము. ఆయనే ఒకరి కాలికురుపును, 'పది జన్మలెందుకు! పది రోజులు చాలు', అని నివృత్తి చేసారు. అందుకని ఏది చేసినా మనం బాగుపడతాము అనుకుంటేనే ఆయన చేస్తాడు. లేకపోతే చేయడు. మనం చెడుకర్మలు చేస్తాము. దాని ఫలితం అనుభవిస్తాము. ఆ ఫలితాన్ని అనుభవించకుండా ఆయన కాపాడాలంటే మనం అటువంటి పనులు యికముందు చేయకుండా వుండే బుద్ధి తెచ్చుకుని వుండాలి. అప్పుడే ఆయన కాపాడుతాడు. మనం మంచిగా

మారకపోతే ఆయన ఎందుకు చేయాలి? ఎందుకు చేయకూడదు? అంటావేమో! ఉదాహరణకు నిన్ను మోసం చేసినవాడే వున్నాడనుకుందాం. అతనిని బాబా ఆ కర్మఫలం అనుభవించకుండా రక్షించారు. అప్పుడేమి జరుగుతుంది?

నేను ఎలా వున్నా రక్షించడానికి బాబా వున్నారు గనుక ఎలాగైనా ప్రవర్తించవచ్చుననుకుంటాడు. అంతేగాక తాను చేసినవన్నీ సరియైనవి గనుకనే బాబా నన్ను కాపాడారు అని గూడ అనుకుంటాడు. ఇంకా ఏదైనా అంటే నాలో లోపాలుంటే సరిదిద్దుకోమని బాబా చెప్పేవారే గదా! కనుక నేను చేసేవి సరియైనవేనని గూడా అంటాడు. అందుకని ఈ శిక్షలన్నీ గూడా మనలో సరియైన మార్పు రావడానికే బాబా చేస్తారు. అయితే నువ్వన్నట్లు ఆయన అటువంటి వాళ్ళకే ఎక్కువగా చేస్తున్నట్లు వున్నమాట నిజమే. చూస్తుంటే అది నిజమేనని అనిపిస్తుంది. తమ ప్రవర్తనలో ఎట్టి మార్పురాని వాళ్ళకు గూడా బాబా ఎంతో మేలు చేస్తున్నారు. కానీ అది ఆయన యిష్టముండి చేయరు. పిల్లలు పట్టుబడితే మనకు యిష్టము లేకపోయినా చాక్లెట్లు యిచ్చినట్లు యిస్తాడు. దాని ఫలితం వాళ్ళు అనుభవించవలసిందే. ఉదాహరణకు ఒకడు ఒక ఉద్యోగము తనకు కావాలని పట్టుబట్టాడు. ఆ ఉద్యోగము అతనికి మంచిది కాదని, యిబ్బందులొస్తాయనీ బాబాకు తెలుసుననుకుందాము.

అందుకని ఆ ఉద్యోగము అతనికి రానివ్వరు. కానీ యితడు పట్టుబట్టి పారాయణ చేస్తున్నాడు. అతనంత పట్టుబట్టాడు గనుక ఆ ఉద్యోగం యిప్పిస్తారు. కానీ ఆ తర్వాత వచ్చే యిబ్బందులకు అతడే బాధ్యుడు. ఇందాక మనం చెప్పుకున్నట్లు ఆ అమ్మాయి భర్త చనిపోయాడు. బాబా మాట వినకుండా అదే సంబంధము చేసినందుకు ఫలితం ఆ అమ్మాయి అనుభవించవలసిందేకదా. అంతేగాక యిలా ఆయన కోరికలను నెరవేర్చడం వలన కలిగిన యిలాంటి ఫలితాలను బట్టి గాని, లేక తాము కోరుకున్నది నెరవేర్చినందుకు కృతజ్ఞతతో గానీ ఆయనపై భక్తి కలిగి ఆయనపై విశ్వాసం కలగడానికి అవకాశముంది గదా! అందుకని ఆయన మనకు శ్రేయస్కరమైన దానినే చేస్తారు అన్న విశ్వాసముండాలి".

"అంతటి విశ్వాసం ఎలా కలుగుతుంది మాస్టారూ?"

"అందుకు ఆయన చరిత్ర 'సాయిలీలామృతము' పారాయణ చేయాలి. ఊరికే పారాయణ చేస్తే చాలదు. ఆయన లీలలను స్మరించుకుంటుంటే మనకే తెలుస్తుంది. ఎవరూ చెప్పనక్కరలేదు. అప్పుడు ఆయనపట్ల భక్తి పెరుగుతుంది. విశ్వాసం పెరుగుతుంది. రాను రానూ మనకు ఆయన ఏం చేసినా, చేయకపోయినా ఆయనపట్ల మన భావం చలించదు. ఆయన మీద భక్తి పెరిగిన కొద్దీ ఆయన వద్దన్న పనులు చేయలేకపోతాము ఆయన చేయమన్నది చేయకుండా వుండలేకపోతాము. క్రమంగా అందరిలోనూ బాబాను చూడడం అలవాటయ్యి మనం అనుకున్న గమ్యానికి చేరగలుగుతాము.

ఇప్పుడు చెప్పు. దీనిలో నీ సాధనకు అంతరాయం ఎక్కడుందో! అందుకని మనకు లక్ష్యం మీద ఆసక్తి ఎంత దృఢంగా వుంటుందో అంతగా సాధన కొనసాగుతుంది. అందుకని బాహ్యపరిస్థితులు ఎప్పటికీ అడ్డుగావు, కాబోవు. అన్నింటికీ మన మనస్సే ప్రతికూలము. మనస్సే అనుకూలము. అందుకే పెద్దలన్నారు: 'మన యేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయే' అని.

అందుకేనోయ్ నేను చెప్పేది. ముందు మనకేది కావాలో తెలుసుకోవాలి. దానిని 'ఆయన యివ్వగలరు' అన్న విశ్వాసముండాలి. ఆ తర్వాత ఆయన చెప్పిన మార్గాన్ని అనుసరించాలి. అప్పుడు గమ్యం తప్పక చేరతాము "

పూజ్యశ్రీ మాస్టరుగారి అమృతవాక్కులు విన్న అక్కడి వారంతా ఆశ్చర్యానంద చకితులయ్యారు. ప్రశ్నించిన ఆ భక్తుడు భక్తిభావంతో పూజ్యశ్రీ మాస్టరుగారితో యిలా అన్నాడు: "మాస్టారూ! మాకు యింత వివరించి మీరు చెప్పేవరకూ ఏమీ తెలియదు. ఇక నుంచి మీరు చెప్పినట్లు చేయడానికి తప్పక ప్రయత్నిస్తాను" అని.

పూజ్యశ్రీ మాస్టరుగారికి నమస్కరించి సెలవు తీసుకున్నాడు.

అందరూ గూడ అదే సంకల్పంతో వెళ్ళి వుంటారని అనుకుంటాను.●

# సాయి అవతరణే మానవాళికి గురుపూర్ణిమ

*~ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ ~*

మానవుడు తన బాల్యంలో చిన్న చిన్న మాటల దగ్గరనుంచి జీవితంలో సర్వ విషయాలనూ మరొకరినుండి నేర్చుకుంటాడు. ఇందులో భాగంగా ప్రకృతినుండి వైజ్ఞానిక విషయాలు తెలుసుకొనడానికి గూడ మరొకరి బోధ అవసరమౌతోంది. అదే ప్రకృతినుండి పారమార్థిక విషయాలనుగూడ మానవుడు ఉత్తమమైన గురువుల వద్ద నేర్వవలసిందే! భాగవతంలోని అవధూత ఉద్ధవగీతలో సాక్షాత్తూ శ్రీకృష్ణునిచేతగూడ ప్రశంసించబడిన పూర్ణపురుషుడు. తాను ప్రకృతిలోని 24మంది గురువులనుండి ఏమినేర్చి పరిపూర్ణతను సాధించాడో చెబుతాడు. దానినే పరమ ప్రామాణికంగా శ్రీకృష్ణుడు ఉద్ధవునికి బోధిస్తాడు. తిరిగి ఆ బోధే మొదటి రెండు దత్తాత్రేయ అవతార చరిత్రల సంపుటమైన శ్రీ గురుచరిత్ర మనకు బోధిస్తుంది. మూడవ దత్తాత్రేయ అవతారమైన శ్రీ మాణిక్యప్రభువు గూడ తిరిగి జ్ఞానమలాగే ఆర్జించినట్లు తమ భక్తులతో చెప్పారు.

పారమార్థిక జ్ఞానమేలేని పామర జీవితం అసూయ, ద్వేషము, మమకారము మొ॥న వాటిని పెంపొందించి, ఇటు వ్యక్తిని, అటు సమాజాన్నీ గూడ తారుమారు చేస్తుంది. జీవితానికి ఏకైక లక్ష్యమైన శాంతి, తృప్తి కొంచెమైనా తొంగిచూడవు. అమావాస్యనాడు ఆకాశంలో యథాపూర్వం చంద్రమండలమున్నప్పటికీ సూర్యునికాంతిని భూమిపైకి ప్రతిబింబించనందువలన అగోచరమౌతుంది. అలానే ఆధ్యాత్మిక జ్ఞానాన్ని మన జీవితాలలో ప్రతిబింబించే గురుస్వరూపం లభ్యం కాకపోతే మానవజీవితం సాగరమధ్యంలో చిక్కిన దిక్సూచి, నావికుడు లేని నౌకలా వుంటుంది. ఏ అనంత విశ్వం పైన చెప్పిన మహనీయులందరికీ గురుస్వరూపమై, బ్రహ్మజ్ఞానులుగా చేసిందో, శాంతి, తృప్తులను వారిరూపంలో మూసపోసిందో, అట్టి విశ్వమే పామరులపాలిటి దుఃఖసాగరంగా పరిణమిస్తుంది.

ఈ సృష్టిలోని అసంఖ్యాకమైన జీవులలో, అదృష్టవశాత్తూ వివిధ స్థాయిలలో ఆధ్యాత్మిక పరిపాకంగలవారు గూడా వుంటారు. పూర్ణగురుని సాన్నిధ్యం ప్రతివారికీ లభ్యంకానప్పటికీ శాంతి,తృప్తులు కుదిర్చే ఆధ్యాత్మిక జీవనము ఒకటి వున్నదని మనకు

తెలిపేవారు కొందరుంటారు. ఇట్టివారి సాంగత్యం శుద్ధ పాడ్యమి నుండి నానాటికీ వృద్ధిచెందే చంద్రకళల వలె మనజీవితాలలోకి ఆత్మజ్యోతిని ప్రసరింపచేస్తుంది. ఈ వికాసం పూర్ణగురు సందర్శనంతో పరిపూర్ణమవుతుంది. ఈ రహస్యాన్నే తెలుపుతుంది గురుపూర్ణిమ.

పూర్వజన్మ సుకృతం వలన పూర్ణగురుని సాంగత్యం ఎందరికో కలుగవచ్చు. కాని వారి వారి పరిపాకాలను అనుసరించి మాత్రమే వేరు వేరు సద్గురు భక్తులు ఫలితాన్ని పొందుతారు. అంతేకాదు, పూర్ణగురుని సాంగత్యం జీవితంలోని కష్టసుఖాలనే మబ్బుతెరల మాటున మరుగవనివ్వకుంటే వారి సాంగత్య ప్రభావంవలన, చంద్రుని ప్రభావం వలన కలువకు వలె, చెట్టు సాంగత్యం వలన కాయ పండైనట్లు – అట్టి దృఢ భక్తుల పాత్రత పెరుగుతుంది. ఈ వికాసంలోని దశలను చంద్రకళలతో పోలిస్తే పూర్ణవికాసం కలిగిన దశను పున్నమితో పోల్చవచ్చు. అట్టి స్థితిపై తీవ్రమైన ఆకాంక్ష కలిగి భక్తుని జీవితాన్ని వుంచగలిగినప్పుడే గురుసేవలో అట్టి స్థైర్యం చిక్కుతుంది.

కనుక సాధకుని ప్రధాన కర్తవ్యం తన పూర్ణగురుని యొక్క పూర్ణస్థితిని తన హృదయఫలకం మీద స్పష్టంగా ముద్రించుకోవడమే! అందుకు సాధనమే గురుపూర్ణిమనాడు సద్గురుని పూజించుకునే ఆచారం అనాదిగా వస్తున్నది. అందుకు ఉత్తమమైన సాధనం పూర్ణగురుని చరిత్ర పారాయణ చేయడమే!

వ్యక్తి జీవితంలో పైచెప్పిన రీతిన ఆత్మవికాసంలో కొన్ని దశలు, లేక కళలు కనిపించినట్లే, మానవజాతి చరిత్రలోకూడా జరుగుతుంది కాబోలు. ఇంతకు ముందటి గురువుల అవతరణలు వివిధ దశలు అనుకుంటే సాయీశుని అవతరణయే మానవాళికి గురుపూర్ణిమ.

సకల జీవులు, దేవతలు, యావత్ విశ్వమూ తమ రూపమేనని, భగవంతుడు మానవులందరికీ ఒక్కడేనని, ఆయననారాధించడానికి మతభేదం అప్రస్తుతమనీ తెల్పుతూ ప్రతి మతస్థునికీ అతని మత జీవితపరాకాష్ఠను తనలో చూపిన వేరొక గురుస్వరూపమేదీ చరిత్రలో కనిపించదు. అందుకే పాల్ రెప్స్ అనే పాశ్చాత్య పండితుడు శ్రీ సాయి అవతరణ మానవజాతియొక్క ఆధ్యాత్మిక చరిత్రలోనే మైలురాయి వంటిదని, నూత్నయుగానికి నాందియనీ అన్నాడు. అంతటి మహనీయుని అనుగ్రహాన్ని చవిచూసిన మనము గురుపూర్ణిమ సార్థకం చేసుకుందాము.

“తల్లికి తగ్గ బిడ్డలుకండి, మీ ఆధ్యాత్మిక ధనాగారాలను నింపుకోండి” అన్నారు సాయి.

వారిచరిత్ర భక్తితో పారాయణచేసే వారికి వారి అనుగ్రహం గూడ నేటికీ లభిస్తుంది. ఇక ఏడురోజులలో మరణించనున్న పరీక్షిత్తుకు అందుకే శుకయోగి వేరొక సాధనచెప్పక, భాగవత శ్రవణం మాత్రమే చేయించాడు. విజయానందుడనే సన్యాసి మరణించనున్న రోజులలో శిరిడీ సాయిబాబా కూడా తరింపుకు భాగవత పారాయణ చేయించారు.

ఈ ఉత్తమ సత్యాన్ని గుర్తించకుంటే శుకుడు, సాయిబాబాలకంటే మనకే ఎక్కువ తెలుసునని భ్రమించి, అనేకమంది మహాత్ముల చరిత్ర పారాయణమనే సాటిలేని సాధనమును మనం అలక్ష్యం చేస్తాము. మహాత్ముల చరిత్రలు మరియు బోధలు శ్రద్ధతో పారాయణ చేయడం వారి ప్రత్యక్ష సాన్నిధ్యంతో సమానమని శ్రీ రమణమహర్షి గూడ చెప్పారు. వెంకయ్యస్వామి గూడ శ్రీ పోతులూరి వీరబ్రహ్మంగారి చరిత్రవంటివి చదవమని ఒక భక్తుడితో చెప్పారు. వీరబ్రహ్మంగారు గూడా తాము దత్తావతారమని ‘కాలజ్ఞానం’లో వ్రాశారు. రెండవ దత్తావతారమైన శ్రీ నృసింహసరస్వతి స్వామి తమ గురించి “శ్రీగురుచరిత్ర” గ్రంథం రూపంలో తామే వుంటామని, అది పారాయణ చేసిన వారికి ఇహపర శ్రేయస్సు, తమ అనుగ్రహము కలుగుతాయని ప్రమాణం చేసిచెప్పారు. ఇతర మతాలలో గూడ ఈ సాంప్రదాయమే వున్నది. బైబిల్ మరియు ఖురాన్ లలో ఎక్కువభాగం ఆయా జాతులలో వెలసిన ‘ప్రవక్తలు’ అనబడు మహనీయుల చరిత్రలుంటాయి. అందుకే ఆయా మతస్థులు వాటిని శ్రద్ధగా చదవాలని విధించారు. అందుకే రానున్న గురుపూర్ణిమకు అరమరికలు లేక అందరూ మహాత్ముల చరిత్రలు పారాయణ చేసుకోండి! ●

# మన ఇల్లు

~ *శ్రీమతి అడిదం వేదవతి* ~

నా కు ఊహ తెలిసేటప్పటికి మేము విద్యానగర్ లో ఉన్నాము. తమ్ముడు ఇంకా పుట్టలేదు. ఇంటి నిండా ఎప్పుడూ చాలామంది ఉంటూ ఉండేవారు. నాన్నగారు ఎక్కువ సమయం హాలులో కూర్చొని వచ్చిన వారితో మాట్లాడుతూనో, వ్రాసుకుంటూనో ఏదైనా గ్రంథం చదువుతూనో, ఉండేవారు. హాలులో కొంతమంది ధ్యానం చేస్తూనో మాస్టరు గారి మాటలు వింటూనో ఉండేవారు. అమ్మ వచ్చినవారికి కాఫీలు, భోజనాలు ఏర్పాట్లు చేస్తూనో, చేయిస్తూనో, వచ్చిన వారితో ఆప్యాయంగా మాట్లాడుతూనో ఉండేవారు. ఆ ఇంట్లో నిరంతరం బాబా గురించి మాటలు, భజనలు, పాటలు ఉంటూ ఉండేవి. లేదా సత్సంగం వినిపిస్తూ ఉండేది. చివరకు నాకు అన్నం పెట్టేటప్పుడు, నాతో ఆడేటప్పుడు, నన్ను నిద్రపుచ్చేటప్పుడు, పాటలతోనే జోడించి ఆ పనులు చేసేవారు. బాగా లేనప్పుడు బాబాను ప్రార్థించి బాబా ఊదీ రాసి, మందులు కూడా ఇచ్చేవారు. నాకు కథలు చెప్పినా, అవి మహాత్ముల కథలో, రామాయణ– భారత – భాగవతాలో లేదా సాయి లీలలో భక్తుల అనుభవాలో అయి ఉండేవి. ప్రతినిత్యం మేమంతా ఏది తిన్నా త్రాగినా బాబాకు నివేదించే తీసుకునేవారము. ఇంట్లో 'వంట చేయడం' ఉండేదికాదు బాబాకు నైవేద్యం చేయడం ఉండేది. 'కాఫీ నివేదన, కాఫీ ప్రసాదం' ఉండేవి. మహాత్ముల దర్శనమూ, శిరిడీ యాత్రలూ ఉండేవి. నిరంతరం సత్సంగము సత్కాలక్షేపమూ మాకు అన్ని వైపుల నుండి వినిపిస్తూనే ఉండేవి.

ఉదయమే నిద్రలేచి గురు బ్రహ్మ శ్లోకం చెప్పుకోవడం ఆ తర్వాత కాలకృత్యాలు తీర్చుకొని ఉదయ హారతికి హాజరు కావడం మా నిత్యకృత్యం. తర్వాత మధ్యాహ్న భోజనం మేమంతా కలిసి చేసే వారము. అప్పుడు కూడా మాస్టరుగారు ఆధ్యాత్మిక విషయాలు మాట్లాడుతూనే ఉండేవారు. అవి వింటూనే మేము భోజనం చేసేవాళ్ళము. విద్యానగర్ లో ఎక్కువగా కాలేజీ విద్యార్థులు మాస్టరుగారి సహోపాధ్యాయులు వస్తుండేవారు. వారితో పాటు సాయంత్రం సత్సంగానికి చుట్టుప్రక్కల ఊరి ప్రజలు వచ్చేవారు. అలాగే తేలు కుట్టినవారు, అనారోగ్యంతో బాధపడేవారు తీవ్రమైన కష్టాల్లో వున్నవారు వచ్చి మాస్టరుగారికి తమ సమస్యలు చెప్పుకుని పరిష్కారము, అభయము, ఆశీర్వచనము తీసుకునేవారు. ఎంతోమందికి చిత్రంగా వారి సమస్యలు తొలగిపోయి వారు కృతజ్ఞతతో ప్రేమతో మళ్లీ మళ్లీ ఆయన దర్శనానికి వస్తూ వుండేవారు. ఇలా ఎప్పుడూ మన ఇంట్లో సందడే సందడి! ఎప్పుడూ

పండుగ వాతావరణమే! నిరంతరం సాయిధ్యాసతో ఆ వాతావరణమంతా నిండి వుండేది. ఇక పండుగ దినాలలోను, పర్వదినాలలోను, ప్రత్యేక సందర్భాలలోనూ మరింత తీవ్రంగా సాయి ధ్యాసలో గడిపేవారంతా!

ఇంతటి దీక్షలో ఆ సద్గురు దంపతులైన మా తల్లిదండ్రులు వుంటూ వున్నప్పటికీ మాకు ఎప్పుడూ విసుగనిపించలేదు. కారణం వారు సాయిని నిరంతరం సేవించడమనే జీవితవిధానం ఎంతో సరదాతోనూ, ఆనందోత్సాహంతోనూ సహజంగా జరిగిపోతూ వుండేది. మామూలుగా కుటుంబంలో సాధారణంగా పెద్దలు నిరంతరం పూజ పారాయణాదులతో గడుపుతూ వుండటం వల్ల పిల్లలతో సరిగా సమయం గడపలేకపోవడం చూస్తాము. అందుకని అటువంటి దీక్ష ఎప్పుడవుతుందా అని పిల్లలు ఎదురు చూడడం చూస్తాము. కానీ మన ఇంట్లో అటువంటి సమస్య ఉత్పన్నం కానేలేదు. కారణం ఆటలు, పాటలు, సరదాలు, సంతోషాలు, యాత్రలు అన్ని వుంటూనే వుండేవి. అయితే అవన్నీ బాబాతో అనుసంధానమై వుండేవి. ఆ ఇంట్లో ఏ వస్తువు ఏ ఒక్కరిదీ కాదు--అందరిదీ!

ఉదాహరణకు, మన ఇంట్లోని బొమ్మలు అందరివీ, తినుబండారాలు అందరివీ, పుస్తకాలు అందరివీ, చాపలు అందరివీ.... అన్ని బాబా ప్రసాదమే! ఆ ప్రసాదాన్ని అందరమూ కలిసి స్వీకరించాలి. అందరమూ తృప్తిగా ఉండాలి. ఇలా ఉండేది మన సంస్కృతి. కనుక మా దగ్గర ఉన్న బొమ్మలతో ఇంటికొచ్చిన వారి పిల్లలు ఆడుకోవచ్చు, పాడు చేయవచ్చు కూడా.. నాకు ఏమీ బాధనిపించేది కాదు. 'ఆ ఇల్లు మన అందరి తండ్రి అయిన సాయిది కనుక మన అందరిదీ! ఆయనను అందరమూ కలిసి సేవించాలి. ఇదే ఆలోచన విధానం ఇంట్లోని అందరిదీ!

అందుకే మాకు ప్రత్యేకమైన బంధుప్రీతి అలవడలేదు. ఎందుకంటే అందరూ గురు బంధువులే కదా! అందరూ మాకు అన్నయ్యలు, అక్కయ్యలు, మామయ్యలు, అత్తయ్యలూ.. వారికి, రక్త సంబంధీకులకి మా మనసులో ఎటువంటి భేదభావం రాలేదు. ఎందుకంటే మా తల్లిదండ్రులకు లేదు గనుక. ఇక కుల మత భేదాలు, ప్రాంతీయ భాషా భేదాలు ఆ ఆప్యాయతను ప్రభావితం చేయలేకపోయాయి. అందరూ మనవాళ్ళే, ఎవరూ పరాయి కాదు - అనేది మాకు తెలియకుండానే మా మనసులలో ముద్రింపబడింది.

ఇదే సంస్కృతి మేము ఒంగోలు వచ్చిన తరువాత కూడా కొనసాగింది. నిరంతరం ఇంట్లో ఉండేవారి సంఖ్య పెరిగింది. వచ్చి పోయే వారి సంఖ్య కూడా. నాన్నగారు కూడా ఎంతో తీవ్రమైన పని ఒత్తిడిలో ఉండేవారు. అయినా మా సరదాలకు, హాయికి ఏమీ లోటు లేదు. పూలజడలు, గోరింటాకులు, పండుగలు, ముగ్గులు, కళలు ఎప్పుడూ ఏదో ఒక సరదా సాయిని సేవించడంలో భాగంగా జరిగిపోయేది. ఇంట్లో ఎప్పుడూ నవ్వులు వినిపిస్తూనే వుండేవి. అందరమూ ఎంతో సంతోషంగా, ఆనందంగా, సరదాగా, ఆడుతూ పాడుతూ వుండేవారం.

అమ్మగారు మాస్టరుగారు కూడా ప్రతి సేవను పరిస్థితిని ఎంతో ఉత్సాహంతో నింపి వేసేవారు. నిరుత్సాహం, నిస్పృహ, అధైర్యం మేము వారిలో ఎప్పుడూ చూడలేదు. ఆర్థిక ఇబ్బందులు, ఉద్యోగ పరమైన ఇబ్బందులు, సామాజిక ఇబ్బందులు, ఎన్నో రకాల మనస్తత్వాల వ్యక్తులతో వ్యవహరించడం వల్ల ఇబ్బందులు... ఇవేమీ అసలు వారిపై ప్రభావం చూపేవి కావు. కనుక మాపై అట్టి ప్రభావం లేనేలేదు. ఇంటి వాతావరణంపై ఎటువంటి ప్రభావం ఉండేది కాదు. అసలలా ఇంటి వాతావరణాన్ని ఏర్పరచడం సాధ్యమేనా? అని ఇప్పుడు ఆశ్చర్యపోవాల్సిందే! నిరంతరం ఉత్సాహం, ఆనందం మన ఇంట్లో పరవళ్ళు తొక్కుతూ వుండేది.

అమ్మ, నాన్నగార్లు ఏ విషయం మీదైనా వాదించుకోవడం కూడా నేను చూడలేదు. వారిద్దరి మధ్య వాదన కాదు కదా, చర్చ కాదు కదా, కనీసం అభిప్రాయభేదాన్ని కూడా మేమెప్పుడూ చూడలేదు. ఇద్దరూ వారి వారి బాధ్యతలను అత్యంత సామరస్యంతో నెరవేర్చేవారు. ఇంటికి వచ్చినవారు రకరకాల మనస్తత్వాలతోను, స్వభావాలతోను వచ్చి తమకు, సాటివారికి ఆ పుణ్యదంపతులకు ఎన్నో సమస్యలు తెచ్చిపెట్టేవారు. వారు అత్యంత ప్రశాంతంగా, చాకచక్యంగా, ప్రేమగా వారు ఎలా ఆలోచించుకుంటే ఆ సమస్య, అభిప్రాయ భేదము తొలగి సామరస్యత కుదురుతుందో చెప్పి, వాళ్ళు వారిని సాయి సేవకు సామరస్యంతో ఉపక్రమించేలా చేసేవారు.

పిల్లలమైన మాకు కలిగిన ప్రతి చిన్న కోరిక, సరదా తీర్చేందుకు ప్రయత్నించేవారు. వారు తీర్చలేని

కోరికలను, మేము అడగనూ లేదు. వారు మేము అడిగినవి తీర్చకుండానూ లేరు. ఇంట్లో నిరంతరం జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొనమని మమ్మల్ని ఎన్నడు బలవంతపెట్టి ఎరుగరు. అది ఎందుకు మంచిదో చెప్పి మా స్వేచ్ఛకు మమ్మల్ని వారు వదిలి వేసేవారు. మేము అడిగే ప్రతి ప్రశ్నకు ఓర్పుగా సమాధానం చెబుతూ, మా మనసులలో బాబాను సేవించడం, స్మరించడం ఎందుకు మంచిదో మాకు అర్థమయ్యే దాకా వివరించేవారు. కానీ మేము హారతి గానీ, పూజ గాని చేయాలని మాకు మేము సంసిద్ధులమయినప్పుడు ఆ పూజ లేక హారతి అశ్రద్ధగా చేస్తే ఒప్పుకునేవారు కాదు. శ్రద్ధగా చేయడంలోనే ఫలితం వున్నదని, అదే బాబాకు సంతోషాన్ని కలిగిస్తుందని చెప్పేవారు.

నాన్నగారు, నేను చిన్నప్పుడు కలిసి పళ్ళు తోముకునేవారం. ఆయన నాకు, తమ్ముడికి స్నానం చేయించేవారు. తరువాత ఆయన స్నానం చేసేవారు. ఆ తరువాత మేము కలిసి భోజనం చేసేవారం. అప్పుడప్పుడు మాకు ముద్దలు కలిపి పెడుతూ, బాబా గురించి మాట్లాడటం గానీ, తమ్ముడిని ఆడిస్తూ భోజనం పెట్టడంగాని చేసేవారు. తరువాత తరువాత ఒక్కొక్కసారి దూరదర్శన్ లో ప్రసారమయ్యే U.G.C కార్యక్రమాలు అందరం కలిసిచూస్తూ భోజనం చేసేవారము. నాన్నగారు నాతో క్యారం బోర్డు, చైనీస్ చెక్కర్, పులి-మేక ఆడేవారు. ఆయనతో కలిసి ఉదయం ఒకొక్కసారి వాకింగ్ కి వెళ్ళేదాన్ని. కొన్ని రోజులు కలిసి ఆసనాలు, ప్రాణాయామం కూడా చేసేవారము. ఆయనే మాకు అవి నేర్పారు కూడా! నేను కూచిపూడి నృత్యం నేర్చుకునే దానిని. నేను ఇచ్చే ప్రదర్శనలకు ఏమాత్రం వీలున్నా తప్పకుండా వచ్చేవారు. ఒంగోలులో చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వం, పాటలు, నృత్యం, ఆటలు - ఏ పోటీలు జరిగినా తప్పకుండా మేమిద్దరము పాల్గొనేవారము. భగవద్గీత శ్లోకాలు పోటీలకు, విచిత్ర వేషధారణ పోటీలకు కూడా పంపేవారు. హిందీ పరీక్షలకు, సంస్కృత పరీక్షలకు కూడా మేము ఇద్దరమూ వెళ్ళాము. అన్నింటికీ ఆయనే శ్రద్ధ వహించి మమ్మల్ని తయారుచేసి పంపించేవారు. ఎక్కువసార్లు మేమిద్దరము ఏదో ఒక ప్రైజ్ గెలిచేవారం. తప్పకుండా స్కూల్లో ఫస్ట్ రావాలి, పోటీలలో మీరే గెలవాలి, అని ఆయన ఎప్పుడూ చెప్పలేదు. తప్పకుండా పాల్గొనండి అని మాత్రమే అనేవారు.

ద్వారక తో ఎక్కువగా క్రికెట్, బ్యాడ్-మెన్-టెన్ ఆడేవారు. బాణాలు వేయడం నేర్పేవారు. ఇక అమ్మ ఇచ్చే ప్రోత్సాహం, అమ్మ ఉత్సాహం, సరదాకు మరేదీ సాటిరాదు. రంగురంగుల కాగితాలతో, కర్రలతో, పుల్లలతో, ద్వారకకు రకరకాల బాణాలు, కిరీటాలు, అమ్ములపొదులు తయారు చేసేవారు. ఇక ద్వారక దగ్గర ఉన్నన్ని బ్యాట్లు, బాల్స్ ఇంకెవరి దగ్గర ఉండేవి కావు. ఎన్నైనా కొనిచ్చే వారు. "మొన్నే కొన్నాను కదా, అప్పుడే మళ్లీ కావాలా?" అని వారు ఎప్పుడూ అనలేదు. కానీ వాడి బ్యాట్ లతో, విల్లు-బాణాలతో, బొంగరాలతో, తుపాకీలతో, చిన్నా పెద్దా అందరూ ఆడుకునేవారు. ఇంటికి వచ్చిన పిల్లలు పాడు చేసేవారు కూడా! అయినా మేమేమీ అనుకునేవారం కాదు. 'పాడైపోతే కొత్తది కొనుక్కోవచ్చు' అనే ధీమా మాకెప్పుడూ వుండేది. రకరకాల చిరుతిండ్లు, పానీయాలు, అమ్మ మా కోసం ఎంతో రుచిగా తయారు చేసేవారు, చేయించేవారు. ఇంటికి వచ్చిన పిల్లల సరదాలు కూడా తీర్చేవారు అమ్మ. వారికి నచ్చిన పిండివంటలు చేయించడం, వారితో ఆడటం ఆమెకెంతో సరదా! ఆమెతో మేము చెస్, చైనీస్-చక్కర్, అష్టాచమ్మా, క్యారంబోర్డు, బిజినెస్- ఇలా అమ్మగారితో మేమంతా ఆడని ఆట లేదు. ఇంటికి వచ్చిన ఆడపిల్లలకు పూల జడలు, ఫోటోలు, గోరింటాకు, వంటలు, వడ్డనలు- ఇలా అన్నీ చేయడం, నేర్పడం చేసేవారు అమ్మ.

అమ్మకు బుక్ బైండింగ్ దగ్గర నుంచి పొలం పనుల దాకా, వంటలు, కుట్లు-అల్లికలు, టైలరింగ్, ఇల్లు కట్టడం, తోటపని... అన్నీ వచ్చు. ఇక శ్లోకాలు, పద్యాలు, పాటలు, పాడటం, రాయడం వచ్చు. అందుకని అందరికీ ఏది అవసరమైతే అది చేసేవారు అమ్మ.

మేము చేసే ప్రతి చిన్న పెద్ద పనులలో, అమ్మ చేసే పని ఎక్కువ, మేము చేసేది తక్కువ వుండేది. ఉదాహరణకు నేను స్కూలుకు వెళుతుంటే బ్యాగు సర్దడం, పాకెట్ మనీ, రబ్బర్ బ్యాండ్ లు, పెన్ను, పెన్సిల్ మొదలైనవి అన్నీ అమ్మే పట్టించుకునేవారు. నాకు చాలా పెద్ద జడ వుండేది. దానిని ఆమె రకరకాలుగా వేసేవారు. మా పుస్తకాలకే కాక ఎప్పుడైనా మా స్నేహితుల పుస్తకాలు, ఏ కారణంగానైనా మా దగ్గరకు వస్తే అందమైన ప్రకృతి బొమ్మలు ఉన్న కాగితాలతో బైండింగ్

చేసి అట్టులు వేసి యిచ్చేవారు. అలాగే మా స్నేహితులకు కూడా రకరకాల చిరుతిండ్లు స్కూలుకు పంపేవారు.

ఇంతా చేస్తే, ఆమెకు ఆరోగ్యం అస్సలు బాగుండేది కాదు. ఆమె చాలా కాలం నుంచి నడవలేరు కూడా! అయినా తన అనారోగ్యం ప్రభావం దైనందిన జీవితం మీద గాని, బాబా సేవ మీద గాని, ఇంటి వాతావరణం మీద గాని, మా సరదా జీవితం మీద గానీ, అస్సలు పడలేదు. అసలు ఆమెకు అంతటి తీవ్రమైన శారీరక బాధలు ఉన్నాయని కానీ, ఆమె అనారోగ్యం గురించి గానీ మాకు గుర్తు కూడా వుండేది కాదు. అంత ఉత్సాహంగా వుంటారు అమ్మ.

ఇక మాస్టరుగారు హాస్యప్రియులు. అమ్మగారు అంతే! ఎప్పుడూ సరదాగా వుండేవారు. చలోక్తులకు సామెతలకు తక్కువ లేదు. అందుకే ఇంట్లోని చిన్నలకు, పెద్దలకు, ఇంటికి వచ్చిన వారికి ఎంతో ఉల్లాసంగా ఉత్సాహంగా వుండేది. ప్రతి సన్నివేశంలోనూ, సంఘటనలోనూ, సరదాలోనూ వెనకాలే నేపథ్య సంగీతంలో సాయినాథుని ధ్యాస అనుసంధానమవుతూ వుండేది. ఉదా. ద్వారక బాణం వేసిన ప్రతిసారి, బాబాకు నమస్కరించుకుని వేసేవాడు. అమ్మ చెస్ ఆడిన ప్రతిసారి, ప్రతి అడుగులోనూ బాబా స్మరణతో వేసేవారు. పూలజడ వేసేటప్పుడు, జడ అల్లినప్పుడు, పక్క పిన్నులు పెట్టేటప్పుడు, పూలు ముడిచినప్పుడు బాబా స్మరణతోనే చేసేవారు. ఇలా ఎల్లప్పుడూ గుర్తు పెట్టుకునే అలవాటు ఒక సంస్కృతిలా మలిచారు అమ్మ.

ఇక ఇంటికి వచ్చిన ప్రతివారిని, ఇంట్లోని వారిని, చక్కగా ఆదరించి వారికి ఉపయోగపడటమే అమ్మ నాన్నగార్ల ఉద్దేశం. తమకు పరిచయం ఉన్న ప్రతివారి మానసిక, శారీరక, ఆర్థిక, ఆధ్యాత్మిక అవసరాలను గుర్తించి స్వాంతన, సహాయము, సహకారము సాధ్యమైనంత అందించి, వారిని సాయి మార్గంలో పయనింప చేయడమే వారి ఉద్దేశం. కనుక నాన్నగారి దగ్గరకు వచ్చే ఆర్తులకు, అర్థార్థులకు, జిజ్ఞాసువులకు, ముముక్షువులకు తగిన మార్గం చూపే వారాయన. ఇక అమ్మగారు వారందరినీ ఆదరించి పేరుపేరునా వారికి ఇష్టమైన వంటకాలను సమకూరుస్తూ, వారి అవసరాలను గుర్తిస్తూ వాటిని సమకూర్చేవారు. ఎవరికైనా అనారోగ్యంగా వుంటే, వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించి తగిన ఆహారము, వైద్యము, విశ్రాంతి ఉండేలా చూసుకునేవారు. ఆ పుణ్యదంపతుల ప్రేమ, ఆదరణను ఎవరూ, ఏనాటికీ మర్చిపోలేరు. పిల్లలమైన మేము కూడా వారందరితో ఎంతో ప్రేమగా, ఆప్యాయంగా, ఆదరణగా ఉండేవారం. నేను ఎవ్వరు ఊరికెళ్ళినా చాలా బాధపడే దానిని. ఎంతమందైనా మాతోనే ఉండాలని తిరిగి వెళ్ళిపోకూడదని నా కనిపించేది.

మా బంధువులలో ఎవరైనా వస్తే వారిని ఆదరించి, వారితో సాధ్యమైనంత సమయం గడిపేవారు అమ్మ, నాన్నగారు. అమ్మ తప్పకుండా వారికి బట్టలు పెట్టి పంపించేవారు. మాకు మాత్రం వారికి, మా ఇంటికి వచ్చి వెళ్ళే గురుబంధువులకి మధ్య తేడా తెలిసేది కాదు. ఇప్పటికీ తెలియదు.

కుటుంబ పెద్దలతో (బామ్మ, తాత గార్లతో) అత్యంత వినమ్రతతో, గౌరవంతో మెలిగేవారు అమ్మ, నాన్నగారు. వారిపట్ల పూజ్యభావంతో ఉంటూ, వారికి సేవచేస్తూ, వారికి కావలసిన భోజనాన్ని, ఇతర అవసరాలను తీరుస్తూ, భక్తి వినమ్రతలతో వుండేవారు. వారు కూడా అమ్మ నాన్నగార్ల మీదగాని, మా మీద గాని తమ పెద్దరికాన్ని ప్రదర్శించే వారు కాదు. ఎంతో విశాల హృదయంతో సంకుచిత తత్వం లేని పరిణతి కలిగిన పెద్దలు వారు. వారు మాతోనే గాక, మన ఇంటికి వచ్చే భక్తులతోను ఇంట్లో వున్న వారితోనూ, చివరకు పనివారితో కూడా ఒకే ప్రేమతో బేధభావం లేక మెలిగేవారు. అమ్మ నాన్నగార్ల జీవితం వారి ఇష్టప్రకారం నడుపుకోవడానికి పూర్తి స్వేచ్ఛనిచ్చే పరిణతి వారిలో కనిపించేది. నేటి కుటుంబ పెద్దలకు వారికి ఎంత తేడా!

మన ఇంటికి వచ్చే వారి వస్త్రధారణ, ఆర్థిక స్థితిగతులు, వారి ఉద్యోగాలు, హోదాలు, ఆస్తిపాస్తులు, కులమతాలు మొదలైన వాటి గురించి అసలు పట్టించుకునే వారు కాదు. అవి ఎప్పుడూ సంభాషణలోకి వచ్చేవి కావు. జీతాలు, హోదాలు, కార్లు, ఆభరణాలు మొదలైనవాటి గురించి మన ఇంట్లో అమ్మ నాన్నగార్లు కనీసం ప్రస్తావించడం కూడా మేము ఎప్పుడూ వినలేదు. అవి అప్రస్తుతములు, అప్రధానములు నిరుపయోగములైనవని వారి దృఢ విశ్వాసం. వాటికి నిత్యజీవితంలో ప్రాధాన్యత లేదు – సాయికి, ఆయన సేవకు తప్ప. ఎదురుకుండా గుడిసెలలో వుండే పిల్లలకు, గురుబంధువుల పిల్లలకు మధ్య తేడా మేమెప్పుడూ చూడలేదు. అందరితో సమానంగా ఆడుకునే

వారము.

పిల్లలమైన మాకు కావలసినవి సంతృప్తిగా సంపూర్ణంగా సమకూరుస్తూనే అందులోనుంచే వివేకవంతమైన ఆలోచనను పెంపొందింప చేసేవారు అమ్మ, నాన్నగారు. ఉదాహరణకు రుచికరమైన వంటకాలు పెడుతూనే ఆరోగ్యం కోసం భోజనం చేయాలని రుచికోసం కాదని చెప్పేవారు. “ఒక్క మూడంగుళాల నాలుకను సంతృప్తిపరచడానికి ఎన్నిపాట్లు? చేదుగా ఉన్నది ఆరోగ్యకరమైనదైతే మూడంగుళాల నాలుక గురించి ఆలోచించకూడదు, అదిచ్చే ఆరోగ్యాన్ని గురించి ఆలోచించాలి. మనసు చెప్పినట్లు మనం వినకూడదు, మనం చెప్పినట్లు మనసు వినాలి” అని చెప్పేవారు. అలాగే మనకున్న డబ్బును గానీ, హోదాను గాని, అందాన్ని గాని, అలంకరణను గాని చూసి ఎవరైనా గౌరవించినా, స్నేహం చేసినా అది వారు మనలను ప్రేమించడము, గౌరవించడమూ కాదని, మనకంటే మనకున్న హంగులకు వారు ఎక్కువ ప్రాధాన్యత నిస్తున్నారని అర్థమని చెప్పేవారు. కనుక మనం వాటికి విలువ నివ్వకూడదని, వాటిని బట్టి మనం ఎవ్వరికీ విలువనివ్వకూడదనీ, అవతలి వారి గుణాలను బట్టి వారికి విలువ నివ్వాలని చెప్పేవారు. అలాగే నిజమైన అందం మన ప్రవర్తన లోనూ మానసిక, శారీరక ఆరోగ్యం మీద ఆధారపడి వుంటుందని, అంతేగాని పైపై అలంకరణలో కాదనీ చెప్పేవారు. ఒకవంక పూల జడలు వేస్తూనే, గోరింటాకు పెడుతూనే, ఈ విషయాలను చర్చించడం వల్ల మా సరదా, మోజూ తీరేది. వివేకవంతమైన ఆలోచనా చేతనయ్యేది.

ఇక సినిమాలు, నవలలు, అనవసర కాలక్షేపాల గురించి, సాంఘిక దురాచారాల గురించి, మూఢ సాంప్రదాయాల గురించి, అన్నింటి గురించి నిరంతరం చర్చలు జరుగుతూ వుండేవి. అయినా మా సరదాలకు లోటేలేదు. అందరం కలిసి సముద్రస్నానాలకు, ఎన్నో యాత్రలకు కూడా వెళ్ళాము. ఎన్నో ఆధ్యాత్మిక గ్రంథాలు చదవడమూ, రాత్రింబవళ్ళు చర్చలు చేయడమూ జరుగుతూనే వుండేది.

నిజానికి మాస్టరుగారు, అమ్మగార్ల వివాహమైనప్పటి నుంచి అమ్మగారికి ఆరోగ్యం బాగాలేదు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ వుండేవారు. ఇంట్లో ఆర్థిక ఇబ్బందులు ఉండేవి. ఇక ఆ పుణ్యదంపతులు ఎదుర్కొంటున్న సమస్యలకు అంతేలేదు. మాస్టరుగారికి ఉద్యోగపరమైన ఇబ్బందులు, ఆర్థిక ఇబ్బందులు, సామాజిక ఇబ్బందులు, భక్తుల రకరకాల మనస్తత్వాల వల్ల ఇబ్బందులు ఎన్నెన్నో వుండేవి. కులాంతర మతాంతర వివాహాలను చేయడం వల్ల ఆయన ఎంతోమంది విమర్శలకు గురయ్యారు. నాస్తిక, హేతువాదులతో ఆయన వాదించడంవల్ల వారి నుంచి వ్యతిరేకతకు గురయ్యారు. నకిలీ ఆధ్యాత్మికతను బట్టబయలు చెయ్యడంవల్ల దొంగ గురువులు, ఆధ్యాత్మిక వంచకుల ఆగ్రహానికి గురయ్యారు. కుటిల రాజకీయాలను అడ్డుకోవడంతో కొందరు రాజకీయ నాయకుల వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఛాందసమైన సాంప్రదాయాన్ని, మతదృష్టిని విమర్శించడం వల్ల ఆయన కుల పెద్దల నుంచి, మత పెద్దల నుంచి తీవ్రమైన వ్యతిరేకతను ఎదుర్కొన్నారు. అంతేకాక ఆయన అవ్యాజమైన ప్రేమను తమ స్వార్థానికి వాడుకొని ఆయననే వంచించి కష్టాలకు గురి చేసిన వారెందరో! ఆయన నిరాడంబరత వల్ల ఆయనకు సరైన సౌకర్యాలు అవసరమే లేదని భావించిన భక్తులందరో! రకరకాల మనస్తత్వాలు గల ఇంటిలో వుండే, ఇంటికి వచ్చే భక్తుల వల్ల నిరంతరం ఆయనకు ఎన్నెన్నో ఇబ్బందులు కూడా కలిగేవి. అయినా ఇవేవీ ఆ పుణ్యదంపతులను, ఆ ఇంటి ఆహ్లాదకరమైన పవిత్ర దీక్షా వాతావరణాన్ని చలింపజేయలేకపోయాయి. అసలన్ని ఇబ్బందులను వారు ఎదుర్కొంటున్నారని వారికి గాని, మాకు గాని అసలు స్పృహలో లేనట్లే వుండేది. బాబా పట్ల వారికి ఎంతటి విశ్వాసమో!

అంతేకాదు, మన ఇల్లు చాలా చిన్నదే ఎప్పుడూ. అయినా దాని హృదయం చాలా విశాలం. మన ఇంటి వాతావరణం ఆహ్లాదకరం, ప్రోత్సాహకరం పవిత్రం, దీక్షామయం. అందుకే మన ఇంటికి వచ్చిన వారందరికీ తిరిగి వెళ్లాలనిపించేది కాదు. మాకు వారిని పంపాలనిపించేది కాదు. మళ్ళీ ఎప్పుడు కలుసుకుంటామా అని మేము, వారు ఎదురుచూస్తూ వుండేవారం అదే నాటికీ, నేటికీ కొనసాగుతోంది, కొనసాగుతూనే వుంటుంది. ●

# పూజ్యశ్రీ అమ్మగారి అనుగ్రహం పొందటం ఎలా?

*~ శ్రీ ఎక్కిరాల ద్వారకనాథ్ జ్ఞానేశ్వర్ ~*

పూజ్యశ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారి ధర్మపత్ని, మనకు గురుపత్ని, దివ్యజనని అయిన శ్రీ అలివేలు మంగమ్మ సమాధి చెందారు అని తెలియగానే ఎందరో భక్తుల హృదయాలు శోకసముద్రంలో మునిగాయి. అందరికీ అమ్మగా తమ చల్లని కరుణను కురిపించి, ఆప్తుల బాధలను తొలగించి, ఆధ్యాత్మిక సంశయాలను తీర్చి, సున్నితమైన పదజాలంతో నిండిన తమ బోధతో సరియైన మార్గం చూపి ఎందరి జీవితాలనో సుగమం చేసిన అమ్మ ఇకపై సశరీరులుగా లేరు అనే విషయం జీర్ణించుకోవడం కష్టమే! వారితో సాన్నిహిత్యం ఉన్న వారందరూ చెప్పేమాట ఒక్కటే "ఆమె మాకు కొండంత అండ" అని.

అయితే పూజ్యశ్రీ మాస్టరుగారి బోధల వలన, రచనల వలన మహనీయుల తత్వం పరిచయమైన వారందరికీ ఓదార్పును ఇచ్చే సత్యమిదే-- మహాత్ములు శరీరత్యాగం చేశాక కూడా నిత్య సత్య స్వరూపులై, స్మరణమాత్రం చేత ప్రసన్నులై మనందరిని కాపాడుతుంటారు – అని. వారు వారి సమాధి రూపంలో, భక్తుల హృదయాలలోని స్మరణ రూపంలో, వారి జ్ఞాపకాల రూపంలో, దేశ కాల పరిమితిని అతిక్రమించి విశ్వవ్యాప్తమై సదా మనకు అందుబాటులో ఉంటారు – అని.

ఈ విషయం మనం ఎంత గుర్తుంచుకుంటామో అంతటి ఫలితం పొందుతాము. ఇహ పర విషయాలన్నింటిలోనూ వారి రక్షణ పొందుతాము. వారి వాత్సల్యానికి కరుణకు పాత్రులం అవుతాము.

అమ్మగారి కరుణ, వాత్సల్యము, అద్భుత శక్తిసామర్థ్యాలు, పూజ్య ఆచార్యుల వారిపై భక్తి అద్వితీయాలు. వారు భక్తులను ఎంతగా కాపాడారో మనం చూస్తే, వారి కరుణకు పాత్రులం అవ్వటం ఎంత అదృష్టమో తెలుస్తుంది. ఇది మనకు గుర్తు ఉండేందుకు అమ్మగారి అద్భుత లీలలు కొన్ని స్మరిద్దాము.

"మా పిల్లల చిన్నతనంలో కట్టిన తిరుపతి



ముడుపు అలాగే ఉండిపోతే 'ద్వారకామాయి ధునిలో వేసెయ్యమంటారా' అని ఒంగోలులో పూజ్యశ్రీ అమ్మగారిని అడిగించాను. "మొక్కులు తీర్చకపోతే కష్టాలు వస్తాయి. ఇన్నేళ్లయ్యిందంటే వాళ్లకు చాలా కష్టాలు వచ్చి ఉండాలి. సత్సంగ సభ్యులు ఎంతమంది వస్తే అంతమందినీ తన ఖర్చుతో తీసుకువెళ్లి తిరుపతి కొండ మెట్లెక్కి వెళ్ళాలి. దర్శనం అయ్యాక అలివేలు మంగాపురం వెళ్లి హుండీలో మొక్కు వెయ్యాలి" అన్నారు.

మేమంతా హడలిపోయాము. నేను డయాబెటిక్ ని. అంజైనా ఉంది. కీళ్లనొప్పులు, ఫిట్స్ వస్తుంటాయి. ఎండ పడదు. ఇలా చెబితే బాబుగారు, అమ్మగారు ఒకటే నవ్వులు. "కొండ ఎక్కేటప్పుడు పాదరక్షలు ధరించవచ్చా?" అంటే, "అన్నమయ్య స్థాయిలో ఉన్నవాళ్ళు తప్ప మిగిలిన వాళ్ళు వేసుకోవచ్చు" అన్నారట.

'శ్రీ వెంకటేశ్వర మహాత్మ్యం' పారాయణ చేయించారు. రెండుసార్లు ప్రయాణమయ్యాము. ఒకసారి మా బృందంలో ఒకరు తీవ్రంగా జబ్బు పడితే క్యాన్సిల్ అయింది. ఇంకోసారి ప్రయాణమైతే నాకు నెలసరి వచ్చి క్యాన్సిల్ అయింది. 'ఈవిడది ఐరన్ లెగ్ రా బాబు' అని బాధపడ్డారు. ఈసారి అమ్మగారు స్వయంగా పిలిచి ముహూర్తం నిర్ణయించారు. రైలు ఎక్కాక భజన చేసుకుంటూ హారతి ఇచ్చుకుని సుఖంగా తిరుపతి చేరాము. ఆ సాయంత్రం బసలోనే సత్సంగం చేసుకున్నాము. ఒక కవర్లో గురుదంపతుల ఫోటో, 11 రూపాయలు దక్షిణతో నావద్ద ఉంచుకున్నాను.

తెల్లవారుజామున నేను, అరుణ అనే అమ్మాయి కలిసి అలిపిరి చేరాము. ఎండ రాకముందే కొండ ఎక్కటం మొదలు పెట్టాము. కొంతదూరం ఎక్కేసరికి నాకు ఫిట్స్ మొదలై, శరీరం చల్లబడి పోతున్నది. మెట్ల పక్కన ఉన్న చిన్న గోడ మీద పడుకోబెట్టి అరుణ గారు నామం చెబుతున్నారు. నా నోట్లో ఊదీ వేశారు.

ఇంతలో ఒకతను వచ్చి నా పక్కన నిలబడి, అతని చేతిలో వున్న పళ్లెంలాంటి దానిమీద టంగ్ టంగ్ మని గంటలు లాగా కొట్టటం మొదలు పెట్టాడు. ప్రతి ఘంటారావానికి నా శరీరంలో సెలైన్ పెడితే ఎలా శక్తి

పుంజుకుంటుందో అలా శరీరం వేడెక్కడం మొదలైంది. నేను లేచి కూర్చోగానే అతడు వెళ్ళిపోయాడు. మేము ఆ మెట్ల మీదే గురుదంపతుల ఫోటో పెట్టి హారతి ఇచ్చి కృతజ్ఞతతో నమస్కరించుకున్నాము. ఇంతలో సత్సంగ సభ్యులు కలిశారు. వాళ్ళు కూడా జరిగింది విని అమ్మగారికి కృతజ్ఞతా పూర్వక ప్రణామాలు చేశారు.

నాకు ఎంతో శక్తి కలిగింది. ఆహారం 2 స్పూన్స్ కంటే తీసుకో లేకపోయాను. దాన్ని బట్టిచూస్తే, అమ్మగారు తన ధ్యానపుణ్యం నాకు ధారపోస్తున్నారా! అనిపించింది. ఎంతో ఎండ కాస్తున్నప్పటికీ మంచుతో చేసిన బెలూన్ లో ఉన్నట్లు ఫీల్ అయ్యాను. అలుపు అనిపిస్తే కూర్చుని సరోజనమ్మ గారిని భజన చెప్పమని చెప్పి అనుసరించే వాళ్లము. మళ్లీ శక్తి పుంజుకుని గబగబా నడుచుకుంటూ పోతుంటే మోకాళ్ళ పర్వతం, ఒక మండపం వచ్చింది.

మేము యాత్రకు ఇంక బయలుదేరుతామనగా, ఒంగోలులో నాకు ఒక కల వచ్చింది. నేను ఇంట్లో వాడే ఎర్రని వెల్వెట్ చెప్పులు వేసుకుని పూజ్యశ్రీ అమ్మగారి ఆఫీసు గది దాకా వెళ్ళిపోయాను. అప్పుడు కాళ్లకున్న చెప్పులు తీసేసి తోటలోకి విసిరేసాను. అప్పుడు ఆఫీసు గదిలో నుంచి తల్లిగారి పెరటిలోకి తొంగి చూశాను. అక్కడ తులసికోటలో శ్రీ మాస్టరుగారి బస్ట్ సైజు ఫోటో ఉంది. ఎర్రని నామం పెట్టుకుని నవ్వుతూ పలకరిస్తున్నట్లుగా ఉన్న అద్భుతమైన ఫోటో అది. కల అంతమైంది

ఇప్పుడు అవే చెప్పులు నా కాళ్లకున్నాయి. వాటిని తీసేసి ఒక కవర్లో పెట్టి తలకింద పెట్టుకుని ఆ మండపంలోని ఒక అరుగు మీద నిద్రపోయాను. నాకు మెలుకువ వచ్చేసరికి మా వాళ్ళు ఎప్పుడు చేరుకున్నారో వాళ్లూ అక్కడే విశ్రమించి లేచారు. అక్కడే ఒక చిన్న కూల్ డ్రింక్ షాప్ ఉంటే వాళ్లను టీ అడిగితే దొరకదు అన్నారు. ఇంతలో 'చాయ్ మిలేగా' అని ఎవరో అంటే అందరం మెట్లవైపు తిరిగాము.

బాబాగారా అన్నట్లు ఒక ముసలాయన తెల్లటి కఫ్నీ, తలగుడ్డా, అవే చెప్పులు, భుజానికి సంచీతో ఉన్నారు. మా మధ్యన ఉన్న ఇంకో అరుగు మీదకు వచ్చి కూర్చున్నారు.

మా గ్రూపులో లక్ష్మిగారికి హిందీలో మాట్లాడటం వచ్చును. ఆవిడకు ఈయన హిందీలోనే జవాబు ఇస్తున్నారు. ఆయన తన సంచీలోంచి కమండలం తీశారు. ఆ సంచి మీద ఒక పక్క రుక్మాబాయి, మరొక పక్క పాండురంగ విట్టల్ చిత్రాలు ఉన్నాయి. ఆయన వారికి సమాధానాలిస్తూ తదేకంగా నా వంక చూస్తున్నారు. నాకు ఆగకుండా కన్నీరు వస్తోంది. ఆయన నా తండ్రి అయినట్లు, ఏనాడో నేను ఆయన నుండి విడివడి ఇప్పుడే మళ్ళీ చూస్తున్నట్లు.. అంతులేని దుఃఖం! ఎంతసేపో నేను ఏడుస్తూ వుంటే, ఆయన నన్ను చూస్తున్నారు.

నేను లేచి ఆయన వద్దకు వెళ్లి నా జుట్టుతో ఆయన పాదాలు కన్నీళ్ల మధ్య తుడిచాను. షాపు వాడి నడిగి టీలు ఇస్తే మొదటి టీ ఆయనకు సమర్పించి మిగిలినవి మేమంతా త్రాగాము. ఆయన అంత గరం టీ కూడా వెంటనే తాగేసి, గ్లాసు కడిగేశారు. సంచీలోంచి పటికబెల్లం తీసి మమ్మల్ని తీసుకోమన్నారు. లేచి కొండ ఎక్కడం మొదలుపెట్టారు. నేను ఏడుస్తూ ఆయనని అనుసరించాను. ఆయన ఆగారు. నా వంక తిరిగి "క్యోం రోతే హై బేటీ, హమ్ ఫిర్ మిలేంగే" అన్నారు. ఆయన కనుమరుగయ్యేవరకు చేష్టలుడిగి నేను అక్కడే నిలబడి పోయాను.

మధుమేహంతో, కీళ్ళనొప్పులతో ఉన్న నా చేత అమ్మగారు తమ కరుణ కురిపించి, తిరుమల యాత్ర చేయించి మొక్కు తీర్పించారు" అంటారు శేషారత్నం గారు."

హైదరాబాద్ దీప్తిశ్రీనగర్ వాస్తవ్యులు నరసింహన్ గారు పూజ్యశ్రీ అలివేలుమంగమ్మతల్లి లీలావైభవాన్ని ఇలా తెలియచేస్తున్నారు !!

ఒకసారి నేను, నా భార్య ఒంగోలు వెళ్ళాము. ఆమెకు కొద్దిగా ఒంట్లో బాగాలేదు. మాస్టరుగారి సమాధి దర్శనం చేసుకుని ప్రదక్షిణలు చేస్తూ వుంటే మా ఆవిడ కళ్ళు తిరిగి పడిపోయింది. వాంతులు కూడా అయ్యాయి. మళ్ళీ కాసేపటికి బాబా గుడిముందు పడిపోయింది. అలాగే పూజ్యశ్రీ అమ్మగారి దర్శనానికి వెళ్ళాము. అమ్మగారు అనుగ్రహ భాషణం చేస్తున్నారు. ఈ సంగతి పూజ్యశ్రీ అమ్మగారికి తెలియచేయాలని నా తపన. కానీ చాలామంది సత్సంగసభ్యులు అక్కడ ఉన్నారు. నేను చివరికి నిలుచుని వున్నాను. కరుణామూర్తి అయిన అమ్మగారు నన్ను పిలిచారు.

నా భార్యను అక్కడకి తీసుకుని రమ్మన్నారు. తీరా చూస్తే ఆమె స్పృహ లేకుండా వుంది. అలాగే లేపి తీసుకువెళ్తే పూజ్యశ్రీ అమ్మగారి దగ్గర ఏడ్చేసింది. పూజ్యశ్రీ అమ్మగారు విభూది పెట్టి, బాబా గుడిలో ధునిలో కొబ్బరికాయ వేసి బయలుదేరమన్నారు. హైదరాబాద్ వెళ్ళాక ఆపరేషన్ చేయించమన్నారు. అదేవిధంగా చేసి బస్టాండుకి రాగానే నార్మల్ అయిపోయింది. ఇక ఇంటికి వచ్చాక ఆపరేషన్ చేయిద్దామని హాస్పిటల్స్ కి వెళ్తే ఎక్కడైనా ఒక లక్ష పైగానే అవుతుందని చెప్పారు. మాకు అంత ఆర్థిక స్తోమత లేదు. ఇక అమ్మగారి మీదే భారం వేసి ప్రయత్నాలు చేస్తున్నాం. ఒకరోజు మాకు తెలిసిన ఆవిడ మా ఇంటికి వచ్చి శ్రీ నాంపల్లి బాబా గుడికి రమ్మని తీసుకుపోయింది. అక్కడ శ్రీ నాంపల్లి బాబా ముందు ఒక కవరు వుంది. ఆమె దానిని నన్ను తీసుకోమన్నది. అందులో 50 వేలు ఉన్నాయి! నేను ఏమిటని అడిగితే, "ఇది తీసుకుని మీ ఆవిడకు ఆపరేషన్ చేయించు. ఈ డబ్బు తిరిగి ఇవ్వకపోయినా ఏమి ఫరవాలేదు!" అని చెప్పింది. ఇది జరిగిన రెండురోజులకే చందానగర్లో గోపీనాథ్ హాస్పిటల్లో 40 వేలరూపాయలకే ఆపరేషన్ చేసారు. ఆమె క్షేమంగా ఉంది. అంతేకాదు నాకు డబ్బులు కూడా సమకూరి తిరిగి ఇవ్వడం కూడా జరిగింది! ఇంత దయను మా మీద కురిపించిన పూజ్యశ్రీ అలివేలుమంగమ్మతల్లి ప్రేమకు కళ్ళు చెమర్చకుండా ఉండడం సాధ్యమేనా ?

కరుణాలయాయై నమః!

"మావారు ఒక ప్రైవేట్ బ్యాంకులో పనిచేస్తున్నారు. పెద్ద ఉద్యోగమే. మేము శ్రీసాయిలీలామృతం, శ్రీగురుచరిత్ర నిత్యపారాయణ చేస్తూ వుంటాము. హైదరాబాద్ లో పూజ్యశ్రీ అమ్మగారి పవిత్ర సన్నిధిలో జరిగే కార్యక్రమాలలోను, ఒంగోలులో జరిగే కార్యక్రమాలలోనూ పాల్గొంటూ ఉంటాము. ఒకసారి మావారి బాంక్ లో పెద్ద పలుకుబడి ఉన్న ఒక వ్యాపారస్తుడు కొంత డబ్బు డిపాజిట్ చేసాడు. అవి ఎక్కడ ఎలా మాయమయ్యాయో తెలియలేదు. ఆ ధనం తాలూకు కాగితాలు కూడా కనిపించలేదు. బ్యాంక్ నుంచి వెంటనే డబ్బు కావాలని ఫోన్లు వస్తున్నాయి. ఆ ధనంకోసం అన్ని బ్రాంచీలలో కూడా వెతికించారు. ఆచూకీ లేదు. ఇంట్లో నాలుగు రోజులపాటు నిశ్శబ్దం ఆవరించింది. పిల్లలు, నేను కూడా ఆయనని పలకరించడానికి భయపడ్డాము. నిమిషనిమిషానికి ఫోన్లు వస్తూనేవున్నాయి. ఒకటే ఆందోళన!ఈ కేసు సి.బి.ఐ దాకా వెళ్ళింది. మావారిని విచారణకు పిలిచారు. దాదాపు ఉద్యోగం పోయేటంతటి పరిస్థితి.

ఇక 'అమ్మా నీవే శరణం!' అంటూ పూజ్యశ్రీ అమ్మగారి దగ్గరకు వెళ్ళి మా పరిస్థితి విన్నవించుకున్నాము. అప్పుడు అమ్మగారు "ఈ అమ్మాయికి పెద్ద సమస్యే వచ్చింది!", అని కొంతసేపు ధ్యానం చేసి సమస్య పరిష్కరమయ్యేందుకు ఇలా చేయమన్నారు---

1) ఒంగోలులో శ్రీమాస్టరుగారి సమాధికి మేమిద్దరమూ 108 ప్రదక్షిణలు చేయాలి.

2)108 మందికి అన్నదానం చేయాలి.

3) శిరిడి వెళ్ళి మూడురోజులు నిద్ర చేసి, నేను, మావారు ఎంత బరువు ఉంటే అన్ని సాయిలీలామృతగ్రంథాలు పంచాలి.

చాలా ఆశ్చర్యం!!! పూజ్యశ్రీ అమ్మగారికి సమస్య విన్నవించుకున్న వెంటనే మరునాడే, "ఇప్పుడు ఆ కాగితాలతో పని లేదు", అని ఫోన్ వచ్చింది! చాలా తక్కువ వ్యవధిలోనే సమస్య పరిష్కారం అయిపోయింది. ఈ విషయం పూజ్యశ్రీ అమ్మగారికి తెలియచేయగానే "పూజ్యశ్రీ మాస్టరుగారి దయవలన గొడ్డలితో అనుభవించవలసిన కర్మ గోటితో పోయింది! ", అన్నారు!

మేము వెంటనే ఒకదాని తరువాత ఒకటి అన్ని మొక్కులు తీర్చేసుకున్నాము.

మాతృశ్రీ అమ్మగారు నావంటివారి సంసారాలు ఎన్ని నిలబెట్టారో ! ఆ తల్లికి ఏమి చేసి ఋణం తీర్చుకోగలము?

అంత గొప్పవారైన అమ్మగారి చల్లని రక్షణలో మనము, మన కుటుంబం ఉండాలంటే, వారి కరుణకు పాత్రులం అవ్వాలంటే ఏమి చేయాలి?

శ్రీ మాస్టరుగారి స్మరణ అన్నా, వారు రాసిన గ్రంథాలు పారాయణ చేయడమన్నా అమ్మగారికి ఎంతో ప్రీతి. పూజ్యశ్రీ

మాస్టరుగారి గుణకీర్తనం అమ్మగారికి ఎంతో ఇష్టం.

ఇటీవల ఒకరోజు సత్సంగంలో శ్రీ సాయినాథ ప్రబోధామృతం గ్రంథం సత్సంగ సభ్యులం అందరం కలిసి అధ్యయనం చేస్తున్నాము (online లో). అందులోని కొన్ని వాక్యాల గురించి అధ్యయనం చేస్తుంటే శ్రీ మాస్టరుగారి, శ్రీ సాయినాథుని గొప్పతనానికి నా మనసు పులకించింది. ఆనందం, ఆశ్చర్యం తట్టుకోలేక అమ్మ దగ్గరకు వెళ్లాను.

అప్పటికి కొన్ని రోజుల ముందు నుంచి శ్రీ అమ్మగారు ఆయాసంతో ఇబ్బంది పడుతున్నారు. చిన్నమాట మాట్లాడినా బాగా రొప్పు వస్తోంది. వారి దగ్గరకు వెళ్లి వారి ఆరోగ్యం గురించి అడిగాను. అయినా సరే మనస్సు ఇంకా పులకింతలోనే ఉండి "అమ్మా ఎంతో గొప్పవారమ్మా బాబా! బాబా, నాన్నగారు ఎంత గొప్పవారో అస్సలు చెప్పలేం! అస్సలు మాలాంటి వారికి ఊహకు కూడా అందనంత గొప్పవారు!" అన్నాను.

ఆ మాటలు వింటున్న అమ్మ ముఖం వికసించింది, వెలిగిపోయింది! చిన్న చిరుమందహాసం అమ్మ ముఖంలో కనిపించింది. "అవును" అన్నారు అమ్మ. ఆ ఒక్క మాటకే అమ్మకి రొప్పు వచ్చింది. అయినా దానిని తమాయించుకుని అమ్మ "చాలా గొప్పవారు. పైపైన చూస్తే గొప్పవారు అనిపిస్తుంది. కానీ ఆలోచిస్తే ఆలోచించే కొద్దీ గొప్పదనం తెలుస్తుంది. జాగ్రత్తగా (లీలలు, బోధలు) ఆలోచిస్తూ వుంటే నాకు మనసు నిలిచిపోతుంది. నువ్వు అయితే విశ్లేషిస్తూ ఆలోచిస్తావు. నాకేమో స్మరణలోకి వెళ్ళిపోతుంది. నువ్వు అలా విశ్లేషిస్తూ, వారి గొప్పదనం గుర్తిస్తూ వుంటే చాలు! అసలు అదే కదా కావలసింది. అసలు కావలసింది అదే!" అన్నారు.

ఇంకా మాట్లాడాలని వుంది అమ్మకు. కానీ రొప్పు ఎక్కువ అవ్వడంతో మౌనం వహించారు. చిరునవ్వు అలానే వుంది. అమ్మను ఇక మాట్లాడించడం ఇష్టం లేక మౌనంగా నిలబడ్డాను. గురువుగారి గుణకీర్తనం అమ్మకు ఎంత ఇష్టమో కదా! అనుకుంటూ, వారి ముఖంలోని ఆనందాన్ని చూస్తూ వున్న నన్ను దగ్గరకు పిలిచి చెంపను చేతితో స్పృశించి ముద్దు పెట్టుకున్నారు.

మనమందరము శ్రీ మాస్టరు గారిని స్మరిస్తే, గుణకీర్తనం చేస్తే, మనందరిపైనా వారి వాత్సల్యం అలా వుంటుంది! వారి కరుణ పొందడానికి అది ముఖ్య సాధనం. శ్రీ మాస్టరుగారి స్మరణ చేస్తే అమ్మకు అంత యిష్టం అన్నమాట.

మనం నిత్యజీవితంలో వారి అండదండలు పొంది ఆనందంగా జీవించాలి అంటే మరొక ముఖ్యమైన అంశం శ్రీ అమ్మగారి బోధలు. మన యీ 'సాయిబాబా' పత్రికలో అమ్మగారు ఎంతో విలువైన వ్యాసాలు వ్రాశారు. ఎన్నో అనుగ్రహ భాషణలలో కీలకమైన అంశాలను విశదపరుస్తూ వారు బోధలు అందించారు. అవి జాగ్రత్తగా ఆకళింపు చేసుకుని తదనుగుణంగా మన జీవితాలను చక్కదిద్దుకోవడం రెండో ముఖ్య సాధనం.

పూజ్యశ్రీ మాస్టరుగారి హృదయం నిండా శ్రీ సాయినాథులే! అలానే అమ్మగారికి పూజ్యశ్రీ మాస్టరుగారే సర్వస్వం! ప్రతి శ్వాసలోను వారే!

వీరిలో ఎవరిని స్మరించినా ఈ ముగ్గురి అనుగ్రహము మనకు కలుగుతుంది. అయితే వీరి ముగ్గురిలో మనకు ఒకొక్క రకంగా ఆధ్యాత్మ తత్వం ప్రకటం అయింది. శ్రీ సాయినాథునిలో అద్వితీయ పూర్ణ దత్త తత్వం ప్రకటం అయితే ఉత్తమ గురుతత్వం, శిష్యతత్వం శ్రీ మాస్టరుగారి లో వ్యక్తం అయ్యింది.

ఇక అమ్మ లోనో.. అమ్మ అమ్మే!! ఆధ్యాత్మిక విద్య మాతృరూపం దాలిస్తే ఎలా ఉంటుందో అలా ఉంటుంది అమ్మగారి తత్వం! ప్రేమ, కరుణ, దయ, వాత్సల్యం, ఓర్పు, అన్నీ పరాకాష్టను చెంది కనబడతాయి. ఇవన్నీ ఇప్పుడు మనకు అందించడానికి అమ్మగారు సమాధి రూపంలో ఒంగోలుకు సమీపంలో 'భట్లమాచవరం', 'గుమ్మళంపాడు' అనే గ్రామాలకు మధ్య దివ్యమైన మందిరంలో కొలువై వున్నారు. ఆ రూపంలో విజయం చేసిన శ్రీ అమ్మగారి దర్శనము, సేవ మనకున్న మూడవ సాధనం.

ఈ సాధనాలను సాధ్యమైనంతగా సద్వినియోగం చేసుకొని వారి కరుణకు పాత్రులమై అందరమూ ఇహపర శ్రేయస్సును పొందాలని కోరుతూ, మనకు అట్టి శ్రద్ధను, భక్తిని, అవకాశాన్ని కలిగించమని శ్రీ అమ్మగారిని ప్రార్థిస్తున్నాను.

జై సాయిమాస్టర్!

# గురువును తెలుసుకోవాలి

*~ పూజ్య గురుపత్ని శ్రీమతి అలివేలు మంగమ్మ ~*

"గురువును తెలుసుకోవాలి. లేకపోతే ఎందుకు వచ్చినట్లు? పిడకలు ఏరుకోవడానికా?" అని శ్రీ శిరిడీ సాయిబాబా అన్నారు. (శ్రీ సాయి లీలామృతం సూక్తులు). అసలు గురువును తెలుసుకోవడమంటే ఏమిటి? గురువును దర్శించడమా? ఆయనకు సాష్టాంగ ప్రణామాలు చేసుకోవడమా? ఆయనను గూర్చిన లీలలను స్మరించుకోవడమా? ఆయనకు సేవ చేయడమా? ఆయనను గూర్చి ఉపన్యాసాలు యివ్వడమా? భజనలు చేయడమా?

ఇవన్నీ దాదాపు అందరమూ చేస్తూనే వున్నాము. మరి అటువంటప్పుడు మనం గురువు గూర్చి తెలుసుకున్న వాళ్ళమవుతున్నామా? ఇంకా ఏమైనా తెలుసుకోవలసి వున్నదా? ఈ విషయంలో మాస్టరుగారు చెప్పినదానిని కొద్దిగా వివరించుకుందాము.

అసలు తెలుసుకోవడం ఎన్నో రకాలు. ఆయనను చూసి ఆయన స్వరూపాన్ని తెలుసుకోవడం. అంటే బాబా ఎలావుంటారోనని మాస్టరుగారు తెలుసుకున్నట్లు. ఆయనను చూసిన వాళ్ళము ఆయన రూపం ఎలా వుంటుందో ప్రత్యక్షంగా తెలుసుకుని వుంటామని చెప్పుకోవచ్చు. చూడని వాళ్ళు, చూసిన వాళ్ళు చెప్పినదానిని బట్టి, చిత్రపటాలను బట్టి, వీడియోలను బట్టి తెలుసుకోవచ్చు. తర్వాత ఆయన కంఠస్వరం, మాటతీరు, మాట్లాడే విధానం మొదలగునవన్నీ గూడ కొంతవరకూ మనం తెలుసుకోవడానికి అవకాశం వుంది. ఇక ఆయన గుణగణాలు, స్వభావము, జీవిత విధానములు గూడ కొంత పరిచయము వున్నవారు, కొంతకాలం ఆయనతో సన్నిహితంగా వున్నవారూ వారి వారి సంస్కారము, అవగాహన మేరకు తెలుసుకోవడానికి అవకాశం వున్నది.

అయితే ఆయన జీవిత విధానాన్ని గూర్చి, ఆయన చెప్పే విషయాలను గూర్చి ఆచరించే ధర్మసూక్ష్మాల గురించి తెలుసుకోవడం కష్టమే. ఎందుకంటే, ఆయన ఏ ఒక్కరికీ అంతుబట్టరు. అందుకని ఆయనను పూర్తిగా తెలుసుకోవడం అసాధ్యమనే చెప్పాలి. అయితే మనకు తెలిసినంతవరకూ చాలునులే అని ఊరుకోవడమా? లేక యింకా యింకా ఆయన గురించి తెలుసుకోవడానికి ప్రయత్నించడమా? అదేనా గురువును గూర్చి తెలుసుకోవడమంటే?

ఈ విషయంలో మన ప్రశ్నలన్నింటికీ సమాధానంగా పూజ్యశ్రీ మాస్టరుగారు గురువును గురించి ఎలా తెలుసుకోవాలో ప్రత్యక్షంగా ఆచరించి చూపారు. అదే మనము గూడ అనుసరించవలసినది. ఇక్కడ అనుసరించడం అంటే అనుకరించడం కాదని తెలుసుకోవాలి. అనుసరించడమనుకొని మనం ఆయనను అనుకరించడానికి ప్రయత్నించే ప్రమాదం ఎప్పుడూ పొంచివుంటుంది. దానిని జాగ్రత్తగా గమనించుకుంటేగాని,

తెలియదు.

పూజ్యశ్రీ మాస్టరుగారి లాగా, లుంగీ బనీను ధరించి అర్థ పద్మాసనంలో కూర్చొనడము, ఆయనలాగా సిగరెట్లు కాల్చడము, కాఫీ ఎక్కువసార్లు త్రాగడమూ గూడా అనుసరించడమనే తలచవచ్చు. మామూలుగా మనకు అలాంటి అలవాట్లు అంతకుముందునుంచే వుండివుంటే పరవాలేదు కానీ, ఆయనను అనుసరిస్తున్నామని, అలాచేయడం మటుకు సరికాదు. ఈ విషయం పూజ్యశ్రీ మాస్టరుగారే యిలా చెప్పారు. "బాబాను అనుసరించడమంటే బాబా లాగ తలగుడ్డ, కఫ్నీ ధరించి చిలిమ్ త్రాగడంకాదు.ఆయనలాగా వుండవలసినఅవసరం ఏమాత్రం లేదు. కారణం ఆయన తమ గురువు లాగా వున్నారా? రామకృష్ణ పరమహంసలాగా వివేకానందుడు వున్నాడా? రమణమహర్షిలాగా మరొకరెవరైనా వున్నారా? అందుకని బాబాను అనుసరించడానికి అలా వుండాల్సిన అవసరం లేదు. పైగా ఆయన వేషధారణ మనం చేసుకుంటే ఆయనంతటి వారము మనము అనే అహంకారం రావడానికి అవకాశం వుంది. ఆయనలాగా అన్నీ చేయలేని వాళ్ళము ఆయన వేషధారణ చేయడంలో అంతరార్థమేమిటో ఆలోచిస్తే తెలుస్తుంది. అదీగాక మనం ఆయన పాదాలచెంత వుండవలసినవాళ్ళము. అప్పుడు వాళ్ళ వేషధారణ మనం అనుసరిస్తే అది గురువు వద్ద వుండవలసిన వినమ్రత లేని వాళ్ళమవుతాము. నిజమైన వినమ్రత వుంటే అలాంటి పనులు చేయలేము గూడ. కనుక ఆయన చెప్పిన వాటిని ఆచరించడమే ఆయనను అనుసరించడం.

అందుకని పూజ్యశ్రీ మాస్టరుగారు ఆచరించి చూపినట్లు మనం గూడ మన గురుదేవులైన పూజ్యశ్రీ మాస్టరుగారిని గురించి యింకా యింకా తెలుసుకోవడానికి, ఆయన చెప్పిన వాటిని ఆచరించడానికి ప్రయత్నించాలి.

సామాన్యంగా మనము పూజ్యశ్రీ మాస్టరుగారి గురించి ఎంతో తెలుసుకుంటాము. కానీ ఆలోచించిన కొద్దీ ఆయన గురించి ఎంతో తెలియదని తెలుస్తుంది.

ఆయన కరుణామయులనీ, - అందరికీ ఎన్నో విధాలుగా సహాయం చేసేవారని, అందరినీ ఎంతో ప్రేమగా చూసేవారనీ, ఎంతో క్షమాగుణం కలవారనీ, శాంత స్వరూపులనీ ఇలా ఎన్నో విషయాలు మనకు తెలుసు. కానీ ఆయనలో మనకు తెలియని, తెలుసుకోవడం కష్టమైన, ఆయన ఆచరించిన ధర్మ సూక్ష్మాలు చాలావున్నాయి. అవి మనం తప్పకుండా తెలుసుకొని తీరాలి. ఆచరించాలి. అవే ఆయన చెప్పక చెప్పిన సత్యాలు. ఉదాహరణకు ఆయన అందరిపట్ల ఎంతో శ్రద్ధ వహించేవారు. ఈ సంగతి మనందరికీ తెలిసిన విషయమే కదా? అని మన కనిపించవచ్చు. కానీ ఎంతటి శ్రద్ధ వహించేవారో కొద్దిగా వివరించుకుందాము.

'శ్రద్ధ' అనే పదానికి అర్థం మమకారంతో కూడిన లేక ప్రేమతో కూడిన జాగ్రత్త లేక ఆసక్తి అని చెప్పుకోవచ్చు. ఈ శ్రద్ధ అనేది మనిషికి చాలా అవసరం. అటు ఆధ్యాత్మికోన్నతికి గాని, ఇటు ఐహిక శ్రేయస్సుకుగానీ శ్రద్ధలేనిదే ప్రయోజనం వుండదు. అందుకే పెద్దలు 'శ్రద్ధావాన్ లభతే జ్ఞానం' అన్నారు. ఇక్కడ జ్ఞానం అన్న పదానికి ఆధ్యాత్మిక జ్ఞానం అని మాత్రమే కాదు. 'శ్రద్ధ గలవాడు దేనినైనా సాధించగలడు' అని అర్థం.

మనం కొన్ని విషయాలలో జాగ్రత్త తీసుకుంటాము. కొన్ని విషయాలలో జాగ్రత్త తీసుకోము. కొన్ని విషయాలలో అతి జాగ్రత్త తీసుకుంటాము. అతి జాగ్రత్త కొన్ని సందర్భాలలో అవసరమే అయినప్పటికీ 'అతి సర్వత్ర వర్జయేత్' అన్నట్లు అన్ని విషయాలలోనూ మంచిది కాదు.

సామాన్యంగా చాలామంది తమపట్ల శ్రద్ధ వహిస్తారు. దానిలో కూడా కొందరికి శరీరం పట్ల ఎక్కువ శ్రద్ధ వుంటుంది. కొందరికి ఆరోగ్యం పట్ల, కొందరికి సౌందర్యం పట్ల, కొందరికి దుస్తులు, ఆభరణాలు యిలా ఒక్కొక్కరికి ఒక్కొక్క విధంగా వుండవచ్చు. మరికొందరు యీ విషయాలన్నింటి పట్ల గూడా శ్రద్ధ వహించవచ్చు. అయితే కొందరు ఒక విషయంలో శ్రద్ధ వహించి మిగతా వాటిని అశ్రద్ధ చేస్తారు.

అలాగే కొందరు భర్త పట్ల, లేక భార్యపట్ల, పిల్లలపట్ల, తల్లిదండ్రులు, స్నేహితులు, బంధువులు, ఇంకా యితరులు– అలాగే చదువు, ఉద్యోగం, వ్యాపారం ఇలా అనేక విషయాలలో అనేకరకాలుగా వారి వారి సంస్కారాన్ని బట్టి శ్రద్ధ వుంటూ వుంటుంది."

అయితే యీ శ్రద్ధ అనేది మానవునికి ఎలా వుండాలి? ఎంతవరకూ వుండాలి? అన్నది ముఖ్యంగా తెలుసుకోవలసి విషయమే! అది తెలుసుకోవాలంటే పూజ్యశ్రీ మాస్టరుగారి జీవిత విధానాన్ని గూర్చి తెలుసుకుని తీరాలి.

పూజ్యశ్రీ మాస్టరుగారు కేవలం ఒక్క విషయంలోనే కాదు, అన్ని విషయాలలోను అందరిపట్ల శ్రద్ధ వహించి

వుండేవారు. ఒక విధంగా చెప్పాలంటే సకల జీవులపట్ల, సర్వకాల సర్వావస్థలలోనూ శ్రద్ధ వహించే వుండేవారని చెప్పాలి. ఎందుకంటే సకల జీవరాశులలోనూ వున్న విశ్వచైతన్యంతో ఆయన తాదాత్మ్యం చెందివుంటారు గనుక. అందుకే అలావుండడం మహాత్ములకు మాత్రమే సాధ్యమేమో!

ఆధ్యాత్మికతలో గొప్పవారుగా అంటే బాబాలు, అమ్మలు, స్వామీజీలు యిలా చాలామంది చేత భగవంతునిగా ఆరాధింపబడేవారిలో చాలామందిలో మనం చూసేదేమిటంటే వారు కేవలం ఆధ్యాత్మిక చింతనలోనే వుండడము. అలాంటి విషయాలపట్లనే శ్రద్ధ వహించడమూ జరుగుతూ వుంటుంది. లౌకిక విషయాలపట్ల అంటే తమ కార్యక్రమాలకు సంబంధించని వాటిపట్ల వారిపట్ల శ్రద్ధ వహించడం సామాన్యంగా చూడము. అందుకనే ఆధ్యాత్మిక చింతన కలవారంటే లౌకికమైన విషయాలను పట్టించుకోరు అనే అభిప్రాయం ప్రజలకు ఏర్పడింది.

అందుకని పూజ్యశ్రీ మాస్టరుగారి గురించి గూడ కొంతమంది అలా అనుకోవడానికి అవకాశమున్నది. ఆయన కేవలం ఆధ్యాత్మిక ప్రపంచంలోనే జీవిస్తుంటారని, సాయిబాబా తప్ప ఆయనకు మరొక ధ్యాసే వుండదనీ కొందరు అనుకుంటారు. కారణం ఆయన నిరంతరం సాయిబాబా గురించి చెప్పడము, పుస్తకాలు వ్రాయడము చేస్తుంటారు గనుక. కానీ ఆయన అది మాత్రమేగాక ప్రతివారిగురించి ప్రతి చిన్న విషయం దగ్గరనుంచి ఎంతో శ్రద్ధగా పట్టించుకుంటారన్నది చాలా మందికి తెలియదు.

ఆయన తమ చదువుపట్ల ఎంతో శ్రద్ధ వహించారు. ఆర్థిక పరిస్థితి సరిగా లేనందువలన పుస్తకాలు, వస్త్రాలు ఇంకా యితర పరిస్థితులూ అనుకూలంగా లేనప్పటికీ ఎంతో శ్రద్ధ వహించి అనుకున్న చదువు పూర్తి చేసారు. అలాగే సృష్టితత్వం గురించి, జనన మరణాల గురించి తీవ్రంగా అన్వేషించారు. శ్రద్ధగా గమనించి వాటి మూలాన్ని తెలుసుకున్నారు. శరీర తత్వాన్ని గురించి, మానసిక తత్వాన్ని గురించి శ్రద్ధగా గమనించి క్షుణ్ణంగా తెలుసుకున్నారు. అలాగే యిటు ఆధ్యాత్మిక రంగంలోను, వైజ్ఞానిక రంగాలకు చెందిన అనేక రకాలైన పుస్తకాలను లౌకిక, సామాజిక రంగాలకు యిలా ఎన్నో రంగాలకు చెందిన పుస్తకాలనెన్నింటినో శ్రద్ధగా చదివి వాటిని అవగాహన చేసుకున్నారు.

శ్రీ సాయిబాబా అనుగ్రహం చవి చూశాక శ్రీ సాయిబాబా గురించి ఎంతో శ్రద్ధగా తెలుసుకున్నారు. అంతేగాక బాబా గురించి లోకానికి తెలియబరచేందుకు ఆయనెంతో శ్రద్ధ వహించారు. ఎన్నో సంవత్సరాల పాటు బాబా గురించి తెలుసుకొని ఆయన తత్వాన్ని పూర్తిగా అవగాహన చేసుకున్న తర్వాత గూడ, ఇంకా యింకా ఆయన లీలలగూర్చి ఎప్పటికప్పుడు తెలుసుకుంటూనే వుండేవారు. ఆయన లీలల విశ్లేషణ జరుపుతూనే వుండేవారు. అందుకే ఆయన రచించిన 'శ్రీ సాయిలీలామృతం' ప్రతి ముద్రణలోనూ మార్పులు చేర్పులు చేస్తూనే వుండేవారు. ప్రతిసారీ అలా మార్చడం వల్ల తమ పుస్తకాలను భక్తులందరూ మళ్ళీ కొనవలసివస్తుంది గనుక డబ్బులు సంపాదించుకోవడానికి ఆయన ఈ మార్గాన్ని ఎంచుకున్నారని కొందరు విమర్శించారు. అందుకు పూజ్యశ్రీ మాస్టరుగారు యిచ్చిన సమాధానం మనకెంతో అవసరం. ఎందుకంటే అది ఆయనకు బాబా పట్ల వున్న శ్రద్ధను తెలియజేస్తుంది. ఆయనిలా అన్నారు, "నేను డబ్బు సంపాదించాలనుకుంటే నాకు ఎన్నో మార్గాలు తెలుసు. నేను వేరే ఎలాంటి పుస్తకాలనయినా వ్రాయగలను. వాటి వల్ల నాకు కుప్పలు తెప్పలుగా డబ్బులు వస్తాయి. అయినా డబ్బులు సంపాదించడానికి పుస్తకాలు వ్రాయవలసిన అవసరం కూడా లేదు. ఎన్నో మార్గాలున్నాయి. కానీ యిక్కడ నా లక్ష్యం ఒక్కటే 'శ్రీ సాయినాథుని గూర్చి ప్రపంచానికి ఎంత బాగా తెలియజేయగలనా?' అని. అందుకే ఈ నా ఆరాటం. ఆయనింకా యిలా అన్నారు. "మనం బయటకు వెళ్ళేటప్పుడు మన శరీరాన్ని సోపులతో కడిగి, వివిధ రకాలైన పౌడర్లు, క్రీములు రాసుకుని, ఏది ఉపయోగిస్తే యింకా మన ముఖం అందంగా కనిపిస్తుందోనన్న ఆరాటంతో రకరకాల సౌందర్య సాధనాలను ఉపయోగిస్తుంటాము. ఎన్నోరకాల దుస్తులను మార్చుకుంటూ వుంటాము. ఎందుకూ పనికిరాని మన ముఖాలకే అందంగా మెరుగులు దిద్దుకుని బయటకు వెళ్తామే! అలాంటప్పుడు విశ్వమంతటికీ శ్రేయస్సును చేకూర్చే సాయినాథుని గురించి ప్రపంచానికి తెలియజేసే ప్రయత్నంలో ఆయనను ఎంత అందంగా ప్రజలముందుకు పంపించాలి? మన శరీరాన్ని అందంగా

చూపించుకోవడం వల్ల మనం అందంగా వున్నామని మనలను అనుకుంటే అనుకోవచ్చు. లేక ఆ సౌందర్యం పట్ల కొందరికి వ్యామోహం కలిగే అనర్థం గూడ దాగివున్నది. కానీ సాయినాథుని అందంగా తీర్చిదిద్దడంలో ప్రపంచ శ్రేయస్సు ఇమిడి వున్నది. సుమా! అందుకని ఎవరు ఏమి అనినా అనుకున్నా నేను నా ప్రయత్నాన్ని మాత్రం చేస్తూనే వుంటాను"

ఆయన బాబాకు తమ జీవితాన్ని అంకితం చేసారు గనుక ఆయనకు అంత శ్రద్ధ వుండడం సహజమే. కానీ ఆయన లౌకిక విషయాలలో గూడ అంతటి శ్రద్ధనూ వహించేవారు. ఆయన చర్యలను నిశితంగా పరిశీలిస్తే ఈ విషయం మనకు స్పష్టంగా తెలుస్తుంది. నిరంతరం ఎంతోమంది ఆయన వద్దకు వస్తున్నా, ఎన్నో పనులలో, వ్యవహారాలలో ఆయన వుంటున్నప్పటికీ భార్యాబిడ్డల పట్ల ఆయన వహించే శ్రద్ధ ఆయనను సన్నిహితంగా చూసిన అందరకూ విదితమే. పిల్లలు ఆహారం సరిగ్గా తీసుకున్నారా? లేదా? మందులు సకాలంలో వారికి వేస్తున్నారా? లేదా? చదువులెలా చదువుతున్నారు? మొదలైన విషయాల దగ్గరనుంచీ వారి ప్రవర్తన ఎలా ఉన్నదో దాకా ఆయన గమనిస్తూనే వుండేవారు. అంతేగాక ఇంట్లో వున్న వాళ్ళందరికీ ఎప్పుడేమి అవసరమో తెలుసుకుంటుండేవారు. వాళ్ళ అనారోగ్యాలకు హోమియో మందులు చెబుతుండేవారు. వారి లౌకిక పరిస్థితులకు తగిన సలహాలనిస్తుండేవారు. మానసిక ఆందోళనలు, చికాకులు మొదలైన వాటిని సరిదిద్దుతూండేవారు.

విద్యార్థుల యొక్క చదువుపట్ల, ఉద్యోగాలపట్ల ఎంతో శ్రద్ధ వహించేవారు. వారికి సరిపడిన ఉద్యోగావకాశాలను పత్రికలలో చదివి, వారికా ఉద్యోగ ప్రయత్నం చేసి చూడమని జాబులు వ్రాసేవారు. ఎవరికైనా ఆరోగ్యం సరిగా లేదని తెలిస్తే వారిని ఫలానా డాక్టరు దగ్గరకు వెళ్ళమని గానీ, ఫలానా మందు వాడితే బాగుంటుందనీ గానీ చెప్పేవారు.

ఇంటికి వచ్చినవారి భోజనం గురించి, వారికి పడుకోవడానికి వసతి దగ్గరనుంచి ఆయన జాగ్రత తీసుకునేవారు. వాకిట్లో తిరిగే కుక్కలపట్ల, పిల్లులపట్ల గూడ ఆయనెంతో శ్రద్ధ వహించేవారు. సకలమూ తానైన శ్రీసాయిస్వరూపులైన ఆయనకు అందరూ ఆయనవారే! అందుకే ఆయనకంత ప్రేమ, అంతటి శ్రద్ధ. మనం విపరీతంగా ప్రేమించే దేని పట్లనైనా మనకెంత శ్రద్ధ వుంటుందో గమనించుకుంటే మనకే ఈ విషయం తెలుస్తుంది.

"కేవలం ముక్కు మూసుకుని కూర్చోడం మాత్రమే ఆధ్యాత్మికత కాదు. లౌకిక జీవితంలో వుంటూ వైరాగ్యం కలిగి వుండి, ధర్మప్రవర్తన, అందరిపట్ల నిస్వార్థప్రేమ లేనిదే ఆధ్యాత్మికత లేదు. సరియైన లౌకికి జీవిత విధానము లేకుండా ఆధ్యాత్మిక చింతనలోనే గడుపుదామనుకోవడం ఒక కాలు కుంటి లాంటిది. అది సరియైన నడక కాదు. నిజమైన వైరాగ్యం కలిగి ఈ ప్రపంచంతో ఎట్టి సంబంధమూ లేక అన్నీ విడిచి వెళ్ళినవారికి మాత్రమే అది సరిపోతుంది" అనేవారు పూజ్యశ్రీ మాస్టరుగారు.

"శ్రద్ధ – మానసిక శ్రద్ధ, శారీరక శ్రద్ధ – అని రెండు రకాలు. కొందరు కొన్ని విషయాలలో మానసిక శ్రద్ధ వహిస్తారు, శారీరక శ్రద్ధ వహించరు. ఉదాహరణకు కొన్ని పనులు యాంత్రికంగానో, లేక కర్తవ్యంగానో చేస్తారుగానీ ఇష్టంతో అంటే మనస్ఫూర్తిగా చెయ్యరు. మరికొన్ని పనులు చేయడం చాలా యిష్టంగా వుంటుంది. కానీ శారీరక యత్నం చేయడానికి బద్ధకం అడ్డువస్తుంది. అందుకని చెయ్యబుద్ధి కాదు. అలాగాక ప్రతిపనీ మానసిక, శారీరక శ్రద్ధతో చేయడమే సరియైన శ్రద్ధ" అని పూజ్యశ్రీ మాస్టరుగారు చెబుతుండేవారు.

'అసలు మరీ అంత శ్రద్ధగా వుండడం అవసరమా? వుండకపోతే ఏమైపోతుంది?' అని ఎవరైనా అనుకోవచ్చు. మనకు అన్నీ బాగున్నంతవరకూ అంతా బాగానే వుంటుంది. మన అవయవాలలో ఏ ఒక్కటి సరిగా పని చేయకపోయినా మనం అశ్రద్ధ చేస్తే ఎలా వుంటుందో తెలుస్తుంది. అలాగే మనం ఎవ్వరినీ పట్టించుకోకపోతే అవతలి వాళ్ళ పరిస్థితి మనకు అర్థం కాకపోవచ్చు. కానీ మనకేదైనా ఎటువంటి అవసరమైనా వస్తే అవతలివాళ్ళు మనలను పట్టించుకోకపోయినా, ఒక వేళ పట్టించుకున్నా సరియైన శ్రద్ధ వహించకపోయినా అప్పుడు మన మనస్సు ఎంత బాధపడుతుందో అనుభవిస్తేగానీ తెలియదేమో!

అలాగే ఆధ్యాత్మిక విషయానికొస్తే శ్రద్ధ అనేది అత్యంత ప్రధానమైనది. భక్తి లేకుండా చేసే ఆరాధన వ్యర్థమని పెద్దలు చెబుతారు. నిజమైన భక్తి కలగాలంటే శ్రద్ధ అవసరం. శ్రద్ధ లేకపోతే సరియైన భక్తి సాధ్యం కాదు.

ఆయనను గురువుగా ఆరాధించే మనము, ఆయన

మనపట్ల చూపించిన శ్రద్ధలో నూరవవంతైనా ఇతరులపట్ల చూపించగలిగితే ఆయన చెప్పిన మార్గంలో పయనించే వాళ్ళమవుతాము. లేకపోతే ఆయన ఒక ఉపన్యాసంలో చెప్పినట్లు ఆయన చెప్పిందంతా వ్యర్థమే అవుతుంది. బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది.

తమకు తెలిసినవారి పట్లనే గాక తెలియనివారి పట్ల, సకల జీవుల పట్ల రాబోయే తరాల పట్ల పూజ్యశ్రీ మాస్టరుగారు చూపించిన శ్రద్ధ ఒకటున్నది - అదే ఆధ్యాత్మికత. అసలైన ఆధ్యాత్మికత గురించి, మహాత్ముల గురించి, వారిని సేవించడం వల్ల వచ్చే ఫలితాల గురించి, ధర్మప్రవర్తన గురించి ఆయన చెప్పిన ఉపన్యాసాలు, వ్రాసిన రచనలు వీటిని అశ్రద్ధ చేయక, శ్రద్ధగా చదివి సరియైన శ్రద్ధను అలవరుచుకుందాము.

ఈ రోజున మాస్టరుగారితో పరిచయమున్న వారమంతా ఆయన గురించి చెప్పకునేటప్పుడు "ఆయన నా పట్ల ఎంత శ్రద్ధ వహించేవారో!" అని చెప్పుకుంటున్నామంటే అది ఆయనకు మనపై వుండే ప్రేమ వల్లనే. అంటే ఎక్కడ ఎక్కువ ప్రేమ, లేక మానవ సహజమైన మమకారము వుంటాయో, అక్కడ శ్రద్ధ తప్పనిసరిగా వుంటుందని స్పష్టమవుతుంది.

ఇది పూజ్యశ్రీ మాస్టరుగారి గురించి మనం తెలుసుకోవలసిన ఒక చిన్న విషయం మాత్రమే. ఆయన జీవన విధానం చూస్తే ఇలాంటివి తెలుసుకోవలసిన విషయాలు ఎన్నో వున్నాయి. మనకు తెలియని విషయాలు ఇంకెన్నో!! అయినా పూజ్యశ్రీ మాస్టరుగారు బాబా గురించి యింకా యింకా తెలుసుకోవాలని ఎలా ఎంతగా ప్రయత్నించేవారో, అలాగే మనం గూడ ఆయన గూర్చి యింకా యింకా తెలుసుకోవడానికి ప్రయత్నం చేద్దాము. అదే "గురువును తెలుసుకోవడం" లోని రహస్యమేమో!

అలా గురువు గురించి తెలుసుకోవడానికి తాపత్రయ పడడము, ప్రయత్నించడమే 'పిడకలేరుకునే' సమయాన్ని సద్వినియోగ పరచుకోవడమేమో! ఆలోచించండి! అనుగ్రహస్వరూపులైన పూజ్యశ్రీ మాస్టరుగారిని అలాంటి తపనను, శ్రద్ధను మనకు అనుగ్రహించమని మనసారా ప్రార్థిస్తున్నాను. ●

## సాధన, సాధ్యమూ సద్గురువే!

03వ పేజీ తరువాయి

గురించి పలువురికి చెప్పడం, ఆయనవైపు మనను మళ్ళించుకోవడానికి ఎంతో ఉపయోగం. గురువారాలు ఏదో ఒక ఆవరణలో సాయి చిత్రపటం పెట్టి ఆయన చరిత్రను (పెద్దగా) చదివి, సామూహికంగా శ్రవణం చేసి, కాసేపు భజన చేసుకుంటే వినేవారికి సాయి ఔన్నత్యం తెలుస్తుంది. వారి హృదయాలలోనూ సాయి ప్రవేశిస్తారు.

అంతేగాక, సాయిని ఆరాధించే ప్రయత్నంలో ఆయన సూక్తులకు విరుద్ధంగా లేకుండా చూచుకుంటారు. సాయి ఆయన సూక్తులద్వారా, ఆచరణద్వారా, మననూ, సమాజాన్ని అశాంతి పాలుచేసే దుర్గుణాలను వీడడం ఎలాగో బోధించారు.

సాయి "అసూయను జయించడం చాల సులువు. ఈ వికారం వలన మనకెలాటి లాభమూ లేదు. అవతలవారి కేలాటి నష్టమూ లేదు. అసూయ అంటే అవతలవారి బాగును సహించలేపోవడమే. ఓర్వలేక అపవాదులు కల్పిస్తాము. వాడు నష్టపోతే సంతోషిస్తాము. ఇదేమి మంచి? అవతలివాడికి మంచి జరగడంవల్ల - మనకేమి నష్టం జరిగింది? కానీ ఎవరూ ఈ సంగతి ఆలోచించరు. వాళ్లు బాగుపడితే మనకే మేలు జరిగినట్లు భావిద్దాం! లేదా మనమూ ఆ మేలును పొందే యత్నం చేద్దాం. వాడు మన సొత్తేమి లాక్కున్నాడు?" అన్నారు.

ఇలాంటి సాయి సూక్తులను మననం చేసుకుని ఆచరిస్తే వ్యక్తులకూ, వ్యక్తులకూ మధ్య వచ్చే ఎన్నో కలతలకు, తద్వారా మానసిక వేదనలకూ, ఆవేశాలకూ తావుండదు. ఎప్పటికప్పుడు మన ఆచరణను సాయి చెప్పిన మార్గానికి మళ్ళించుకుంటూ, ఆయన చెప్పిన మార్గాన పయనించడానికి కృతనిశ్చయులమవుదాం! ●

# పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతం-శ్రీ గురు చరిత్ర | 450-00 |
| శ్రీ సాయిబాబా జీవిత చరిత్ర | 90-00 |
| శ్రీ సాయి లీలామృతము | 99-00 |
| శ్రీ గురు చరిత్ర | 99-00 |
| శ్రీ సాయి సన్నిధి | 120-00 |
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | 125-00 |
| శ్రీ సాయినాథ ప్రబోధామృతము | 80-00 |
| సాయినాథ పూజ | 40-00 |
| సాయినాథ స్థవనమంజరి | 10-00 |
| శిరిడి ఆరతులు | 15-00 |
| సాయిబాబాను సేవించడమెందుకు | 10-00 |
| సత్సంగము-భజన | 5-00 |
| శిరిడి క్షేత్ర సందర్శనము | 40-00 |
| విజ్ఞాన వీచికలు | 99-00 |
| పరిప్రశ్న | 99-00 |
| మతమెందుకు? | 50-00 |
| ఏది నిజం? | 50-00 |
| ధ్యానయోగ సర్వస్వం | 99-00 |
| బుద్ధధ్యాన హృదయం | 49-00 |
| దత్తావతార మహత్యం | 75-00 |
| సంహితాయన గురు ద్విసాహస్రి | 128-00 |
| పురుషసూక్త రహస్యం | 40-00 |
| సాయిసూక్తి-ఆచార్యవాణి | 10-00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | 49-00 |
| అవధూత శ్రీ చీరాల స్వామి | 49-00 |
| అవధూత శ్రీ వెంకయ్యస్వామి | 70-00 |
| శ్రీ ఆనందమాయి అమ్మ | 49-00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | 80-00 |
| శ్రీ హజరత్ తాజుద్దీన్ బాబా చరిత్ర | 49-00 |
| స్వామి సమర్థ(అక్కల్కోట స్వామి) | 49-00 |
| మనము-మన సంస్కృతి | 70-00 |

### ఇతర ప్రచురణలు

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు | 120-00 |
| అవధూత చివటం అమ్మ | 70-00 |
| శ్రీ సిద్ధారూఢ స్వామి చరిత్ర | 70-00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు | 125-00 |
| మరో నందదీపం | 80-00 |
| ఆచార్య అమృత లేఖావళి | 40-00 |
| భగవాన్ శ్రీ భరద్వాజ | 175-00 |
| బాలల శ్రీ సాయి లీలామృతము | 25-00 |
| మహాపురుషుడు | 50-00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు (2) | 125-00 |
| బాలల శ్రీ సాయి సన్నిధి | 50-00 |

### BOOKS IN ENGLISH

| | |
|---|---|
| Sai Baba the Master | 175-00 |
| Sree Guru Charitra | 99-00 |
| Supreme Master(Swami Samartha) | 99-00 |
| Sai Baba of Shiridi and His Teachings | 99-00 |
| Life and Teachings of Hazarat Tajuddin Baba | 99-00 |
| Children's SaiBaba the Master | 60-00 |

### BOOKS IN OTHER LANGUAGES

| | |
|---|---|
| Sadguru Sai Baba(Hindi) | 150-00 |
| Sai Leelamrutham(Kannada) | 150-00 |
| Sai Baba Jeevitha Charitham(Malayalam) | 220-00 |
| Sai Baba Leelamrutham(Tamil) | 175-00 |
| Sri Guru Charitra (Hindi) | 99-00 |
| Swami Samartha (Kannada) | 99-00 |
| Sri Guru Charitra(Kannada) | 45-00 |
| Shiridi Aarathi(Tamil) | 15-00 |
| Stavana Manjari(Tamil) | 10-00 |
| Tibet Yogi Milarepa Jeevitha Charitra(kannada) | 55-00 |
| Sri Sainath Prabodhamruthamu (Kannada) | 65-00 |


**SRI GURUPADUKA PUBLICATIONS, c/o SRI MANGA BHARADWAJA TRUST,**

Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole, Hyderabad - 68

Phone : +91 - 74160 41550

Branch Office: Kondaiah Bunk Street, Kothapet, Ongole, Prakasam Dt., Andhra Pradesh.

Phone: 08592 233271

**Send DD in favour of "Sri Manga Bharadwaja Trust(Publications)", payable at Hyderabad or Ongole.**



**Date of Publication: 21st of each month. Permitted to post: 23rd, 24th, 25th and 26th of each month.
Edited, Printed and Published by Dr. R.S. Sasidhar, Ph.D. trustee of Sri Manga Bharadwaja Trust,
Ongole - 523002. Postal Registration Number : Prakasam/16/2021-2023, Regd.No. 37926/83.**






IF UNDELIVERED, PLEASE RETURN TO: SRI MANGA BHARADWAJA TRUST, KONDAIAH BUNK STREET,
KOTHAPETA, ONGOLE, PRAKASAM DT., A.P. - 523002.